ఆదివారం

ప్రజాశక్తి

ఫిబ్రవరి 13, 2005

వాలెంటైన్స్ డే

'ఒకరోజుప్రేమ' కాదు

హ్యాపీ బర్త్‌డే

(13-2-2005 నుంచి 19-2-2005 వరకు)

హాషీజాబాను
2సం॥, 13.2.2003
షహనాజ్-అజీమత్
నెల్లూరు

స్వాతి-రోజా
6సం॥,13.2.1999
వెంకటమ్మ-మానయ్య
రామాయగూడెం-రంగారెడ్డి

లక్ష్మణసాయి
10సం॥, 14.2.1995
యశోదరాజ్-నాగరాజు
మంగళగిరి-గుంటూరు

నిరంజన్
1సం॥, 14.2.2004
రేణుక-శ్రీనివాస్
దీపాయంపల్లి-మెదక్

అబ్దుల్ హమీద్
1సం॥, 14.2.2004
రియాజ్-షరీఫ్
గిద్దలూరు-ప్రకాశం

అశ్వని
ఫిబ్రవరి-14
పద్మ-జయరాజు
పజ్జూరు-నల్లగొండ

అన్విత
2సం॥, 16.2.2003
స్వర్ణలత- వీరప్రతాప్‌రెడ్డి
పీలేరు-చిత్తూరు

లక్ష్మీసుప్రియ
5సం॥, 18.2.2000
పాతగుంటూరు

నమ్రత
7సం॥, 19.2.1998
లలిత-శేషగిరిరావు
ములకలపల్లి-ఖమ్మం

లిఖితసాయి
3సం॥, 19.2.2002
రెడ్డిప్రమీల-రెడ్డినరసింహులు
సోమల-చిత్తూరు

ఇందు
2సం॥, 19.2.2003
వీరమ్మ-నరసింహులు
కోసిగి-కర్నూలు

ప్రశాంత్
రుక్మిణి-సత్యనారాయణ
మంచిర్యాల-నిజామాబాద్

ఉదయ్‌తేజ
10సం॥, ఫిబ్రవరి-1995
శివలీల-నరసింహ్మా
సింగోటం-మ॥నగర్

సాహిత్య(స్వీటీ)
4సం॥, ఫిబ్రవరి-2001
శోభారాణి-సంఘమేశ్వరరావు
శ్రీకాకుళం

వెంకటసాయితేజ
సరిత-ఏడుకొండలు
మార్కాపురం-ప్రకాశం

భవ్యశ్రీ
1 సం॥, ఫిబ్రవరి-2004
లక్ష్మి-రమేష్
రావులపల్లి-రంగారెడ్డి

ప్రమోద్‌కుమార్
4సం॥, ఫిబ్రవరి-2001
పద్మావతి-వేణుగోపాలరావు
నర్సారావుపేట-గుంటూరు

రీడర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం

జాతీయపక్షి

30వ తేదీ సంచిక కవర్‌స్టోరీ 'నెమలి మన జాతీయపక్షి' చాలా ఆసక్తికరంగా ఉంది. మాకు మా బాల్యం, మా ప్రాథమిక పాఠశాలచదువు రోజులను గుర్తుచేసింది. బలపాలు బదులు ఇచ్చి నెమలి ఈకలను తీసుకుని పుస్తకాల్లో పెట్టుకున్న నాటి మా స్నేహితులు మా కళ్లముందు కదలాడినట్లయింది. నెమలి పుట్టుకనూ, అది సంచరించే ప్రదేశాలను తెలియజెప్పారు. మగనెమలి మాత్రమే నాట్యం చేస్తుందని తెలుసుకుని ఒకింత ఆశ్చర్యపోయాం. ఆ పక్షిని మన జాతీయపక్షిగా ఎంచుకున్న తీరు గురించి వివరించినది విజ్ఞానదాయకంగా ఉంది.

-కె గీతానంద్,
కుమార్‌పల్లి, హనుమకొండ.

ముఖ చిత్రంఎంతో బాగుంది

ఈ వారం ముఖచిత్రం ఎంతో ఆకర్షణీయంగా ఉంది. మన జాతీయపక్షి నెమలిని ప్రజలందరకూ ఒక్కమారు గుర్తు చేసుకునేటట్లు ఉంది. ముఖచిత్ర ముద్రణ విషయంలో మంచి శ్రద్ధ తీసుకోవడం హర్షించదగ్గది. వివిధ దేశాల జాతీయ చిహ్నాలు, జాతీయపక్షుల వివరాలు చాలా వివరంగా, అందరికీ అర్థమయ్యేరీతిలో, ఫొటోలతో సహా తెలియజేసినందులకు ధన్యవాదాలు. ఈ వారం కథ 'చెదిరిన కల' బాగుంది.

-కొప్పల కాశీవిశ్వేశ్వరరావు,
వేదవేద్య సూర్యవంశీధర్, విశాఖపట్టణం.

జాతీయపక్షి

కవర్‌స్టోరీ నన్నెంతగానో ఆకట్టుకుంది. అదేవిధంగా మన జాతీయచిహ్నాల గురించి వివరించిన తీరు బాగుంది. "పాపికొండల నడుమ గోదారి తీరాన" అనే వ్యాసం కూడా బాగుంది.

-పొట్లపల్లి మహేశ్‌బాబు,
ఎల్లూరు, మహబూబ్‌నగర్

అంశాలన్నీ బాగున్నాయి

కవర్‌పేజీ సూపర్బ్. చూడగానే డిజైనింగ్ ఆకట్టుకునేలా ఉంది. అంతేకాదు కవర్‌స్టోరీ ద్వారా ఎన్నో విషయాలు తెలుసుకున్నాం. కార్టూన్ కదంబం ఆసక్తికరమైన అంశాలతో ఆకట్టుకుంది. రియల్‌స్టోరీలోని సువర్ణగారి స్వయం ఉపాధిమార్గం ఎంతోమంది చదువులేని వారికి ఆదర్శంగా నిలుస్తుంది. ఆరోగ్యం శీర్షిక ద్వారా "కుష్టు"కు సంబంధించిన ఎన్నో తెలియని విషయాలు తెలుసుకోగలిగాం. టూరిస్ట్‌గైడ్(పట్టిసీమ), కళాసాహితి అన్నీ బాగున్నాయి.

-గరిడేపల్లి ప్రసాదరావు,
బుగ్గపాడు, ఖమ్మం.

కవిత్వం-జీవనశైలి

'ఉషోదయాన...సునామీ'' కవిత హృదయాన్ని హత్తుకునేలా ఉంది. వృద్ధుల, పసిపిల్లల ఆర్తనాదాలు ఈ కవితలో వినిపించాయి. సున్నితమైన సునామీ అనే పదం ఎంత బీభత్సం సృష్టించిందో కదా అనుకున్నాం. జీవనశైలిలో 'రిటైర్‌మెంట్‌కు దూరం' అనే వ్యాసం బాగుంది. రిటైరై ఖాళీగా ఉంటే సమాజం, భార్యాపిల్లలు ఎంత చులకనగా చూస్తారో అనిపించింది. ఏదైనా ఉద్యోగంలో చేరితే ఎంత విలువగా చూస్తారో కూడా చాలా బాగా వర్ణించి చెప్పారు. డబ్బుకున్న ప్రాధాన్యత చెప్పారు. కంప్యూటర్ యుగంలో యంత్రాల ప్రాధాన్యంలో రజకవృత్తి కోల్పోయిన సత్యం అనే యువకుడి జీవితం వర్ణించిన కథ 'చెదిరిన కల' బాగుంది. పిల్లల కథలో 'పారిన పథకం' కూడా బాగుంది.

-ఎం లలిత,
కంచరాం, శ్రీకాకుళం

రిటైర్‌మెంట్ !?

జీవనశైలి శీర్షికలో వ్యాసం బాగుంది. ఉద్యోగం చేస్తున్నపుడు ఆఫీసులో ఎన్నో ఒత్తిడులకు గురైన ఉద్యోగులు ఉద్యోగవిరమణ తర్వాత అందరూ చేసే చులకనను తట్టుకోలేక ఆర్థికంగా కుటుంబాన్ని ఆదుకోవడానికి సిద్ధపడుతున్నారు. ఇది ఇంకోవిధంగా అర్హత కల పట్టభద్రులకు ఉపాధికి గండి పడుతోంది. కళాసాహితిలో కవితలు బాగున్నాయి.

-బాసంగి లక్ష్మీకాంతమ్మ,
గాజువాక, విశాఖపట్టణం.

కంచి కార్టూన్

ఈ వారం కార్టున్‌గా జయేంద్రపై వేసినది బాగుంది. 1800పేజీల చార్జిషీట్ కట్టలను వకీలుగారు కంచిస్వామికి చూపిస్తూ అన్న మాటలు నేటి న్యాయవ్యవస్థకు అద్దంపడుతున్నాయి.

-సిరిపురపు రామకోటేశ్వరరావు,
ఎనికేపాడు, విజయవాడ రూరల్.

మనలో మాట

చెక్క ఫేసులు

ఈ భూలోకంలో
కొన్ని మొహాలుంటాయి!
ఏం జరిగినా ఆ మొహాల్లో ఏ విధమైన హావభావాలు మచ్చుకైనా కనిపించవు. ఇది ఆ మొహాల ప్రత్యేకత!
ఆ జాతి ఫేసులు సందర్భానికి అనువుగా స్పందించవు. ఆసలు స్పందన అనేమాటకి ఆ ఫేసులు సూటుకావు. ఆ మొహాలు ఏ మాత్రం అల్లరి కాకుండా ఎంతో గుట్టుగా వెలుగుతుంటాయి.
అందువల్ల పొట్ట చెక్కలయ్యే జోకు
ఆ మొహాల్ని నవ్వించలేదు!
గుండె పగిలే విషాదం
ఆ ఫేసుల్ని ఏడిపించలేదు!
అసలాఫేసులు ఏ సందర్భానికి ఎట్లా రియాక్టవుతాయో ఎవ్వరూ ఊహించలేరు!
ఎల్లాంటి రియాక్షన్లకీ తావులేని ఆ మొహాల్ని 'చెక్కఫేసు'లని పిలుస్తారు!
దురదృష్టవశాత్తు...
ఈ చెక్కఫేసులు తగిలినప్పుడు...
చెక్కుచెదరని వాటి క్వాలిటీకి-
చేతులెత్తి మొక్కాలి!
నవరసాల్లో నవ్వు రసానికి గిరాకీ ఎక్కువ. అలాంటి నవ్వుని చెక్కఫేసులు చీదరించుకుంటాయని సర్వేవల్ల తెలిసింది!
అధికారుల్లో కొందరు నవ్వుకి దూరంగా వుంటారు. నవ్వడాలు లేవని బోర్డు కట్టి జాగ్రత్త పడతారు!
అంచేత-
పదిమందిలో వాళ్లకి నవ్వు వచ్చినప్పుడు... ఆ నవ్వుని వాయిదా వేసుకుని... ఇంటికి వెళ్లి బాత్‌రూంలో తీరుబడిగా నవ్వేసుకుని తరిస్తున్నారని తెలిసింది!
నవ్వు-
బాత్‌రూంలలో...
నవ్వులపాలవుతున్నందుకు
గొప్ప దిగులుగా వుంది!
నవ్వొస్తే హాయిగా నవ్వేసి...
గుండెల్లో బరువుదించుకోకుండా
చెక్కఫేసు ఫిలాసఫీ ఎందుకు?

ఈ సంచికలో . . .

ఓరా! ...	3
కార్టూన్ కదంబం... ...	4
కవర్ స్టోరీ ...	5
జీవనశైలి ...	10
బాలల కథ ...	11
బాలనేస్తాలు ...	12
ఇంతి సంగతి ...	16
నువ్వొద్ది ...	17
ఆరోగ్యం ...	18
పుస్తక పరిచయం ...	20
న్యాయసలహాలు ...	24

ఇంకా...

శశిరేఖా పరిణయం

కథ ... 8, 9

గ్రీటింగ్స్ వీరుడు

రియల్ స్టోరీ ... 14, 15

ఫిబ్రవరిలో ఆస్ట్రేలియా అమోఘం

టూరిస్ట్‌గైడ్ ... 21

'నంది నాటకోత్సవం'-2004

కళాసాహితి ... 22, 23

ఔరా!

"చెబితే వింటివ గురూ గురూ..."

"వినకే చెడితిర శిష్యా...శిష్యా..." అని ఇప్పుడు ఎంత వాపోయినా ఏం లాభం! కేసుల మీద కేసుల దెబ్బకు వాచి...పోయిన పరువు దక్కేదెలాగో తెలియడం లేదుమరి! "జయహో గురువా" అని విజయేంద్ర అన్నా, "విజయహో శిష్యా" అని జయేంద్ర అన్నా ఒకప్పుడు మహభేషుగ్గా సాగిపోయింది. గురుడు శ్రీకృష్ణజన్మస్థాన సేవలందుకోను వెళ్ళినా...కంచి గరుడ సేవలందుకోడానికి శిష్యుడున్నాడులే అనుకున్నారు. కానీ విధి వక్రచూపు చూసింది కాబోలు. చచ్చీచెడీ గురుడు బయటకు పూర్తిగా రాకమునుపే శిష్యుడు విజయేంద్ర జైలుకి విజయం చేశాడు. కాషాయం దొరలెంతగా తమ రాజకీయపబ్బాలకు పూర్ణంబూరెల్లా ఈ 'కంచికథ'ను ఉపయోగించుకుందామని ఎంత తాప్రత్రయపడ్డారని!? ఎన్ని తెరలు కప్పినా శ్రీవారి నీలివర్ణ, రక్తవర్ణ అభియోగాల చిట్టా కనబడకుండా ఆగట్లేదు. నిత్యపూజలకు కూడా గతిలేకుండా చేసేస్తున్నారని దుమారం లేపడానికి కూడా ఛాన్స్ లేకపాయే! ఔరా...విధికెంత పోగాలపు బుద్ధి!!

ఇరాక్ జ్వరం-అమెరికా వైద్యం!



పాతప్రభువులుంగారు శ్రీమాన్ బుషేశ్వర్రావుగారు కొత్తప్రభువుగా ప్రమాణస్వీకారం కూడా అయిపోయింది కదా! ఆర్తత్రాణ పరాయణుడుగా కనబడినట్లుంటుందనీ, చేసిన పాపాలకు కొత్త పెయింట్ వేసినట్లుంటుందనీ, తన అసలు ప్లానుని అధికారబద్ధం చేసినట్లుంటుందని ఇరాక్‌కి ఎన్నికల జ్వరం ఎక్కించాడు. డాక్టరమ్మలా తానే ఇంత మందు పోస్తానంటున్నాడు. మందు సిద్ధం చేసి, రోగం వ్యాపింపజేయడం ఈ ప్రపంచాధిపతికి కొత్తేంగాదుకదా!!!

భౌభౌ డాగ్‌కీ డవురీ!

బీహార్‌లోని జార్ఖండ్‌ఏరియాలో ముండాదౌడా అనే గ్రామం ఉందండి. అక్కడొక పిల్ల ఉందండి. ఆ పిల్లకేమో ఎనిమిదేళ్ళండి. అందరికిలా కాకుండా ఆ లక్ష్మికి కుక్కపళ్ళు వచ్చాయండి. అదేదో అశుభమని భయపడ్డారండి. ఆ పిల్లకు పెళ్ళికాదన్నారండి. ఏదన్నా కుక్కకిచ్చి ముందు పెళ్ళి చేస్తే ఆ దోషం పోద్దన్నారండి. ఇంకోపెళ్లి సలక్షణంగా చెయ్యొచ్చన్నారండి. ఓ కుక్కని ఆ ఎనిమిదేళ్ళ పిల్లకు టెంపరరీ మొగుడుగా చూశారండి. కానీ ఆ కుక్కకు కట్నం అడిగారండి. ఇరవైరెండు వేలు రొఖ్ఖం, స్కూబీ-దూబీ-దూ అనే కుక్క సాహసాల సీరియల్ వచ్చే కలర్‌టీవీ, డబల్‌కాట్ బెడ్ కట్నంగా ఇచ్చారండి. ఆయ్...అదండీ సంగతి. మనవాళ్ళ మూఢనమ్మకాలకు అంతూపొంతూ ఉండవనీ ఇట్టాంటివాటిని చూసే కదండీ అనేది మరి!

కార్టూన్ కదంబం


డబ్ల్యుటిఎ హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్-2005
బంతి మీ కోర్టులోనే ఉంది...
కాదు, మీ కోర్టులోనే...
ప్రభుత్వం
నక్సల్స్
నారు

సునామీ బాధితులపై
పోలీసుల లాఠీ


2004
2005
హామీలు
1
2
1
8
బెస్ట్ సిఎం రమణ్‌సింగ్
8వ స్థానంలో వైఎస్
- ఇండియాటుడే సర్వే

వాలెంటైన్స్ డే

ఒకరోజు ప్రేమ కాదు

వాలెంటైన్స్ డే..! ఈ పేరు వింటేనే ప్రేమికులహృదయాలపరవళ్ళు తొక్కుతాయి. తమ ప్రియతములకు ప్రేమ సందేశాలు పంపుకోవటం, కానుకలివ్వటం వంటి కార్యక్రమాలతో ఈ రోజంతా ప్రేమికులు హడావుడిగా వుంటారు. ఈ "హడావుడి" మంచి లాభసాటి వ్యాపారంగా ప్రపంచమార్కెట్టు పాలైంది. మార్కెట్టు ఈరోజు వాలెంటైన్స్ డే ని"వాలెంటైన్స్ వీక్" పేరున వారం రోజుల వ్యాపారంగా సా...గదీశారు. ఈ జోరు హోరులో ప్రేమ అనే మహోన్నత మానవీయ అంశ, దాని రూపురేఖలు-లక్షణాలు వికృతమై పోతున్నాయి. నిజమైన ప్రేమకనబడటం, నిలబడటం కష్టమై పోతోంది. రేపు జరగనున్న 'వాలెంటైన్స్ డే'కి ఈ మార్కెట్‌నేపథ్యం లేకుండా స్వచ్ఛంగా ఉంటే ఎంత బాగుండు !

వి.వి. వరప్రసాద్

ఈ వాలెంటైన్స్ డే పుట్టుక గురించి విభిన్న కథనాలు ప్రచారంలో వున్నాయి. క్రైస్తవ మత బోధకుడైన సెయింట్ వాలెంటైన్ పేరున ఈ రోజు ప్రచారంలోకి వచ్చిందని కొందరు చరిత్రకారులు చెబుతున్నారు. రోమన్ మత ప్రచారకుడైన సెయింట్ వాలెంటైన్ క్రైస్తవమతాన్ని వదులుకోవటానికి నిరాకరించి నాటి చక్రవర్తి క్లాడియస్ చేతిలో క్రీ.శ. 269 ఫిబ్రవరి 14న హతమయ్యాడు. వాలెంటైన్ చనిపోయే రోజు జైలర్ కుమార్తెకు వీడ్కోలు సందేశాన్ని పంపాడు. 'నీ ప్రియమైన వాలెంటైన్' అంటూ ఆ లేఖ ముగుస్తుంది.



సెయింట్ వాలెంటైన్

వాలైంటైన్ ఉదంతంపైనే మరో కథ ప్రచారంలో వుంది. మత బోధకుడిగా పనిచేస్తున్న వాలంటైన్‌ను క్లాడియస్ చక్రవర్తి తన ఆజ్ఞలను ఉల్లంఘించాడన్న ఆగ్రహంతో జైలుపాలు చేస్తాడు. జైలుఖైదీగానే వాలెంటైన్ మరణి స్తాడు. అతడి స్మారక దినంగా ఫిబ్రవరి 14ను క్రీ.శ 469లో వాలెంటైన్స్ డే గా నాటి పోప్ గెలాసియస్ ప్రకటించాడు. క్రమంగా ఈ వాలెంటైన్స్ డే, ప్రేమ సందేశాల మార్పిడి వేదికగా మారింది. సెయింట్ వాలెంటైన్ ప్రేమికుల ఆరాధ్య దైవంగా మారాడు. ప్రేమికులు తమ ప్రియతములకు ప్రేమ సందేశాలతో పాటు చిరుకానుకలు పంపటం కూడా ఒక సంప్రదాయంగా స్థిరపడిపోయింది. అమెరికాలో మిస్ ఈస్తర్ హౌలండ్ అనే యువతి తన మొదటి ప్రేమ సందేశాన్ని పంపినట్లు తెలుస్తోంది. క్రీ.శ 1800 సంవత్సరం నుండి ఈ ప్రేమికుల రోజు వ్యాపారాత్మకంగా మారిపోయింది. ప్రేమ సందేశాలు ముద్రించిన వాలెంటైన్ కార్డులు, బహుమతుల వ్యాపారం అప్పటి నుండే ప్రారంభమైంది. కొలరాడో సమీపంలో లౌ లాండ్ (ప్రేమభూమి) అనే పేరు కలిగిన చిన్న పట్టణంలోని పోస్టాఫీసును వాలెంటైన్స్ డే నాడు ప్రేమ సందేశాలు ముంచెత్తుతాయి. ప్రేమికులు తమ ప్రేమను, భావోద్వేగాలను తమ భాగస్వాములతో పంచుకుంటారు. అదే విధంగా పిల్లలు కూడా తమ శైలిలో ప్రేమ సందేశాలను తమ సన్నిహితులకు పంపిణీ చేస్తుండటం విశేషం.



రోమ్‌సామ్రాజ్యంలో ప్రారంభం

వాలెంటైన్స్‌డే రోమన్ సామ్రాజ్యంలో తొలుత ప్రారంభమైనట్లు చారిత్రక ఆధారాలు

సెయింట్ వాలెంటైన్‌ను ఉరి తీసిన రోమన్ చక్రవర్తి రెండవ క్లాడియస్

చెబుతున్నాయి. ప్రాచీన రోమ్ సామ్రాజ్యంలో ఫిబ్రవరి 14వ తేదీని జునో అనే ప్రేమదేవత గౌరవార్థం సెలవు దినంగా పాటించేవారు. ఆ మరుసటి రోజు ప్రేమదేవుడైన లూవర్సియా పేరు మీద లూపర్‌కాలియా పండుగను నిర్వహించేవారు. ఆనాడు యువతీ యువకులు నిర్బంధంగా విడివిడిగా జీవించాల్సిందే. ఈ పండుగలో భాగంగా రోమన్ యువతుల పేర్లను కాగితం ముక్కలపై రాసి ఒక పాత్రలో వేసేవారు. ప్రతి యువకుడు తన జోడీని ఎంపిక చేసుకునేందుకు ఈ పేర్లను తీయవలసి వుంటుంది. యువకునికి లభించిన పేరు కలిగిన యువతి ఆ పండుగ సీజన్ మొత్తం అతడి ప్రియురాలిగా గడపాల్సి వుంటుంది. కొన్ని సందర్భాలలో ఈ జంటలు ఏడాది పొడవునా సన్నిహితంగా వుండేవారు. ఆ పరిస్థితిలోనే పరస్పరం ప్రేమించుకుని జీవిత భాగస్వాములుగా మారేవారు. రెండో క్లాడియస్ రోమన్ సామ్రాజ్య సింహాసనం అధిష్టించే నాటికి పరిస్థితి మారిపోయింది.

క్రూరుడైన రెండో క్లాడియస్ తమ సైనికులు కేవలం సైనిక కార్యకలాపాలకే పరిమితం కావాలన్న ఆంక్షలు విధించాడు. వారు తమ కుటుంబ సభ్యులకు, ప్రేమికులకు దూరంగా వుండాలని భావించాడు. ఈ కారణం చేతనే తన హయాంలో రోమ్‌లో అన్ని వివాహాలను, నిశ్చితార్థాలను రద్దు చేశాడు. రెండో క్లాడియస్ హయాంలోనే రోమ్‌లో సెయింట్ వాలెంటైన్ మత బోధకుడిగా జీవిస్తుండేవాడు. తన సహ బోధకుడు సెయింట్ మారియస్‌తో కలిసి క్రైస్తవ మృతవీరుల కుటుంబాలకు, వివాహితులకు రహస్యంగా సహాయం అంద చేస్తుండేవాడు. చక్రవర్తి ఆదేశాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తు న్నాడన్న ఆరోపణపై వాలెంటైన్‌ను నాటి ప్రభుత్వం నిర్బంధించింది. అతడిని చిత్రహింసల పాల్జేసి, శిరచ్ఛేదం విధించారు. క్రీ.శ 269 ఫిబ్రవరి 24న వాలెంటైన్‌కు మరణశిక్ష అమలు జరిపారు. ఆ సమయంలోనే ఈ లూపర్‌కేలియా ఉత్సవాలను ఫిబ్రవరి నెల మొత్తం నిర్వహించేవారు. ఈ ఉత్సవాల్లో తమ జోడీని ఎంపిక చేసుకునేందుకు యువకులు లాటరీ పద్ధతిని అనుసరించేవారు. ఈ సంప్రదాయాన్ని మత ప్రచారానికి అనువుగా మలుచుకోవాలని భావించిన నాటి మత గురువులు లాటరీలో యువతుల పేర్లకు బదులుగా మత ప్రవక్తల పేర్లను జోడించారు. ఈ విధంగా ఎంపికైన మత ప్రవక్తలను రానున్న సంవత్సరానికి మార్గదర్శకులుగా భావించే సంప్రదాయం నాటి నుండి ప్రారంభమైంది.

ఆనాటి వాలెంటైన్స్ డే వేడుకలు

వాలెంటైన్స్ డే నాడు ఆయా దేశాల వారు ఆసక్తికరమైన పద్ధతులను అనుసరించేవారు. వందేళ్ళనాడు ఇంగ్లాండ్‌లో ఈ వాలెంటైన్స్ డే రోజున పిల్లలంతా పెద్దల తరహాలో దుస్తులు ధరించి ఇంటింటికీ వెళ్ళి వాలెంటైన్‌ను కీర్తిస్తూ పాటలు పాడేవారు. వేల్స్‌లో ఈ వాలెంటైన్స్ డే రోజున ప్రేమికులు తమ ప్రియతములకు బహుమతులిచ్చేందుకు అందమైన నగిషీలతో కూడిన చెక్క బొమ్మలను ఉపయోగించేవారు. హృదయాకారపు బొమ్మలు, తాళం, తాళం చెవి వంటి అలంకార వస్తువులతో తమ ప్రేమను విశదపరిచే వారు. మరికొన్ని ప్రాంతాల్లో యువతీ యువకులు తమ ప్రేమికులను ఎంపిక చేసుకునేందుకు లాటరీ పద్ధతిని అనుసరించే వారు. ఈ విధానం ద్వారా తాము ఎంపిక చేసుకున్న వారి పేర్లను దుస్తులపై ఒక వారం పాటు ప్రదర్శించే వారు. తమ ప్రియతముల పేర్లను దుస్తులపై ధరించటం ద్వారా వారు తమ ప్రేమభావనను వెల్లడించేవారు.

కొన్ని దేశాల్లో యువతులకు యువకులు దుస్తులను బహూకరిస్తారు. ఆ దుస్తులు నచ్చి వాటిని తనతోనే వుంచుకున్న యువతి వాటిని బహూకరించిన యువకుడిని వివాహం చేసుకోవాల్సివుంటుంది. కొన్ని ప్రాంతాల్లో మరో విభిన్నమైన సంప్రదాయాన్ని అనుసరించేవారు. వాలెంటైన్స్ డే నాడు ఒక యువతి ఏ వస్తువును చూస్తే సంబంధిత రంగంలోని వ్యక్తులను వివాహమాడతారని విశ్వసించే వారు.

ప్రేమికులరోజే పెళ్ళిరోజు

ప్రేమికుల రోజును తమ వైవాహిక దినోత్సవంగా మార్చుకున్న జంటలు కొన్ని వున్నాయి. వారిలో కొందరు...

టాక్‌షో యువరాణిగా ప్రఖ్యాతి చెందిన లీజా గిబ్బన్స్, స్టీఫెన్ మెడోస్‌ను 1991 ఫిబ్రవరిలో ఇదే రోజున వివాహమాడింది.

1996 ఫిబ్రవరి 14న మేట్ గార్షియా రోమన్ యువరాజును వివాహమాడింది.

ప్రేమంటే ... ?

ప్రేమ అంటే కేవలం రెండక్షరాల మాట కాదు... అది రెండు హృదయాల కలయిక. మానవీయ సంబంధాల అల్లిక.. ప్రేమంటే ఆత్మీయత... "నీవూ నేనులు" చెప్పలేనంత సన్నిహితం కావటం ప్రేమ. ఒకరి కష్టాలను మరొకరు తమ కష్టాలుగా భావించి స్పందించటం ప్రేమ. ఒకరి స్వేచ్ఛను, సమానత్వాన్ని మరొకరు గౌరవించటం ప్రేమ. ఆ ఇద్దరి మధ్య పరస్పర విశ్వాసం ప్రేమ. నిరంతర మానవీయ సంబంధం ప్రేమ. ప్రేమంటే శరీరానికీ, హృదయానికీ ఉండే సంబంధం.. హృదయం లేని శరీరాలుంటాయి... కానీ శరీరం లేకుండా హృదయం వుండదు. ఈ రెండూ ఒకటి లేక మరొకటి లేవు..

అయితే ఈనాడు ప్రేమపేరిట ఇందుకు భిన్నంగా వుందనటం అతిశయోక్తి కాబోదు. శరీరానికి, హృదయానికి వున్న సంబంధమే ప్రేమ అని చెప్పుకున్నాం కదా... కానీ ఇప్పుడు హృదయ సౌందర్యానికి ప్రాధాన్యత తగ్గి శారీరక సౌందర్యానికి మాత్రమే ప్రాధాన్యత పెరుగుతోంది. ఇందుకు కాలానుగుణంగా వస్తున్న మార్పులు, ముఖ్యంగా పాశ్చాత్య వికృత విశృంఖల సంస్కృతి విజృంభణ అనంతరం చోటు చేసుకున్న మార్పులు ప్రేమకు వక్రభాష్యం చెబుతున్నాయి. ప్రేమ అనేదాని చుట్టూ ఎంతో కుళ్ళుసంస్కృతి పేరుకుపోయింది. రెండు హృదయాల కలయిక ప్రేమ అన్న నానుడికి భిన్నంగా ఏకపక్ష ప్రేమ (వన్‌సైడ్ లవ్) మాత్రమే మనకు కన్పిస్తోంది. "నేను నిన్ను ప్రేమిస్తున్నా (ఐ లవ్ యూ), నీవు కూడా నన్ను చచ్చినట్టు ప్రేమించాల్సిందే..! లేకపోతే నేను ఛస్తా (అనేది కొంత మంది మాత్రమే) నువ్వు ఛస్తావ్..!!" అన్న బెదిరింపు ధోరణిలో నేటి ప్రేమ వ్యవహారాలుంటున్నాయి. ఇందుకు నేటి మీడియా ముఖ్యంగా సినిమాలు దోహద పడుతున్నాయి. ఒక ప్రయత్నంగా ఓ యువతికి 'ఐ లవ్ యూ' అని చెప్పటం ఫ్యాషన్‌గా మారింది. ఒక వేళ ఆ యువతి నుండి సానుకూల స్పందన ఎదురైతే సరే. లేకపోతే ఆమెను చంపటమో లేక తాను ఆత్మహత్యా ప్రయత్నం చేయటం యువకులకు అలవాటుగా మారింది. తనను ప్రేమించమంటూ వెంటపడిన ఉన్మాదిని తిరస్కరించిన పాపానికి విజయవాడ విద్యార్థిని శ్రీలక్ష్మి దారుణ హత్యకు గురైన





విష్ యూ హ్యాపీ వాలెంటైన్స్‌డే

దేశదేశాల్లో ఈ వాలెంటైన్స్ డే నాడు గ్రీటింగ్ కార్డుల అమ్మకాలు కూడా జోరుగానే జరుగుతాయి. క్రిస్మస్, నూతన సంవత్సరం తరువాత గ్రీటింగ్ కార్డుల ప్రాముఖ్యత కలిగిన సందర్భం ఇదే కావటం విశేషం. ఈ సందర్భంగా ప్రపంచం అంతటా దాదాపు వంద కోట్ల గ్రీటింగ్ కార్డులు అమ్ముడవుతాయని ఒక అంచనా. మన దేశానికి చెందిన "ఆర్చీస్" అనే సంస్థ అంతర్జాతీయంగా కూడా పెద్దఎత్తున తన ప్రత్యేక గ్రీటింగ్ కార్డులు అమ్ముతోంది. కేవలం మన దేశంలోనే దాదాపు **120** పట్టణాల్లో **450** బ్రాంచీలతో ఆర్చీస్ తన గ్రీటింగ్ కార్డుల వ్యాపారం చేస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా అమ్ముడవుతున్న గ్రీటింగ్‌కార్డుల్లో మూడో వంతుపైగా ప్రేమ సందేశాలతో కూడినవే అయినా **25** శాతం కార్డులు హాస్య సందేశాలతో వుంటాయని ఒక అంచనా. జాతీయ అంతర్జాతీయ గ్రీటింగ్ కార్డుల కంపెనీలు దాదాపు అన్నీ వెబ్‌సైట్ గ్రీటింగ్ కార్డుల పద్ధతిని ప్రవేశపెట్టారు. ఆయా కంపెనీల వెబ్‌సైట్‌ల్లోని కార్డు ఇమేజ్‌పై మనం సెలెక్ట్ చేసి తమ ఇష్టుల ఇ-మెయిల్‌కు పంపే ఏర్పాటుంది. ఇది ఒకింత రహస్య ఏర్పాటులాగా కూడా ఉండి కొంతమంది ప్రేమికులకు బహు సౌకర్యవంతంగా తయారైంది. అవే వెబ్‌సైట్లలో గ్రీటింగ్ కార్డుల కిందే తమతమ ఉత్పత్తులు గిఫ్ట్ ఆర్టికల్స్‌గా క్లిక్ అండ్ ఆర్డర్‌గా పెట్టారు. షేక్స్‌పియర్ ప్రేమికులు రోమియో జూలియట్ నివశించిన ఇటలీలోని వెరోనా నగరానికి జూలియట్ పేరిట దాదాపు వెయ్యి కార్డులు వస్తాయట.

సంఘటన ప్రేమోన్మాదానికి పరాకాష్టగా నిలుస్తుంది. హైదరాబాద్‌కు చెందిన శ్రీలక్ష్మి విజయవాడ శాతవాహన కళాశాలలో ఎంసిఎ చదువుకుంటూ అక్కడి తన బంధువుల ఇంట్లో వుంటున్నది. ఆమె సహ విద్యార్థిగా వున్న మనోహర్ తనను ప్రేమించమంటూ ఆమెను వేధిస్తుండేవాడు. తాను ఎదుర్కొంటున్న వేధింపుల గురించి కళాశాల యాజమాన్యానికి, తన కుటుంబ పెద్దలకు చెప్పినా ఫలితం, శూన్యం కావటంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. వారు కూడా నామమాత్రపు చర్యలతో చేతులు దులుపుకోవటంతో మనోహర్ ఆగడాలు శృతి మించాయి. ఒక సందర్భంలో తన ప్రేమను తిరస్కరించి, నలుగురిలో అవమానపరచిందన్న ఆగ్రహంతో మారణాయుధంతో తరగతి గదిలో కూర్చుని వున్న శ్రీలక్ష్మిని దారుణంగా నరికి చంపాడా ఉన్మాది. ఆమె చేసిన హాహాకారాలు అక్కడి వారిని భయభ్రాంతులను చేసినా అతడిని ఏ మాత్రం కదిలించలేకపోయాయి. గుంటూరులోని కాలేజీ క్లాసురూమ్‌లో వరలక్ష్మి హత్య మరో ఉదాహరణ. ప్రేమ పేరిట జరిగే వేధింపులకు లెక్కేలేదు. ఇది వన్‌సైడ్ లవ్‌లోని పైశాచికత్వం. యువతీ యువకుల ఇద్దరివైపు నుంచీ ఉన్న ప్రేమలో కూడా అనేక అపభ్రంశలు చోటుచేసుకుని ఉన్నాయి. తొలియవ్వన దశలోని శారీరక ఆకర్షణలనే ప్రేమ అని పొరబడే సాంస్కృతిక వాతావరణం కమ్ముకుని ఉంది. టాలీవుడ్, బాలీవుడ్, హాలీవుడ్ చిత్రాల కాలుష్యంలో అసలు ప్రేమకు అడ్రస్సు లేకుండా పోయింది. ఇలాంటి దశలో "వాలెంటైన్స్ డే"లు, "వాలెంటైన్స్ వీక్"లు కుర్రకారు వీక్‌నెస్‌లపై వ్యాపారంగా పరిణమించింది.

వాలెంటైన్స్ డే వ్యాపారాలు

గతంలో పాశ్చాత్య దేశాలకే పరిమితమైన ఈ వాలెంటైన్స్ డే వంటి సంప్రదాయాలు పాశ్చాత్యనాగరికతగా, ఒక ఫేషన్‌గా మన దేశంలోకి కూడా ప్రవేశించాయి. వస్తు వినిమయ సంస్కృతి ప్రేమను వ్యాపార వస్తువుగా మార్చివేసిందనటంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో ప్రేమికుల రోజు వ్యాపారం రెండు నెలల ముందు నుండే జోరుగా జరుగుతుంది. గ్రీటింగ్ కార్డులు, చాక్లెట్లు, ఐస్ క్రీమ్‌లు, స్వీట్లు వంటి వాటి విక్రయాలు, పూలు, పూలబొకేల విక్రయాలు మహాజోరుగా సాగుతాయి. ఆయా కంపెనీలు తమ వ్యాపారాన్ని పెంచుకునేందుకు ఈ వాలెంటైన్స్ డే సంప్రదాయాన్ని ప్రేమికులరోజుని వారోత్సవాలుగా పెంచి పోషిస్తున్నాయి.

ఈ వాలెంటైన్స్ డే సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా 11 కోట్ల గులాబీలు ముఖ్యంగా ఎర్రగులాబీలు అమ్ముడుపోతాయి. అమెరికాలో అమ్ముడుపోయే గులాబీలలో 60 శాతం కాలిఫోర్నియాలో ఉత్పత్తి అయినవే. మిగిలిన గులాబీలు విదేశాల నుంచి ముఖ్యంగా దక్షిణ అమెరికా నుంచి రెక్కలు కట్టుకుని వచ్చి వాలతాయి. ఇటీవల మన దేశంలో కూడా గులాబీ సాగును ఒక వ్యాపారపంటగా ప్రోత్సహించారు. ఎగుమతులు-విదేశీమారకద్రవ్యం దృష్టిలో పెట్టుకుని ఈ గులాబీ పూల వ్యవసాయం ఫ్లోరీకల్చర్ పేరిట జరుగుతోంది. ఈ వాలెంటైన్స్ డే అమ్మకాలకై ఈ సంవత్సరం కూడా మంచి ఆర్డర్లు వచ్చినట్లు పూలవ్యాపారులు సంతోషపడుతున్నారు. భారత గులాబీలు నెలరోజుల ముందునుంచే రేపటి ఫిబ్రవరి 14 వరకూ నిల్వ వుండే ప్రత్యేక ప్యాకేజింగ్‌తో విమానమెక్కుతున్నాయి. వాలెంటైన్స్ డే నాడు ముఖ్యంగా గులాబీలను కొనుగోలు చేసే వారిలో 73 శాతం మంది యువకులే కావటం విశేషం. మహిళలు ఇందులో 27 శాతానికే పరిమితమయ్యారు.

ఇక ఈ సందర్భంగా అమ్ముడు పోయే చాక్లెట్లు, స్వీట్లు కొన్ని కోట్ల రూపాయల విలువ చేస్తాయి. అమెరికాలో ఈ చాక్లెట్ల సంప్రదాయానికి తొలుత 1866లో నెక్కో కంపెనీ శ్రీకారం చుట్టింది. ఈ కంపెనీ హృదయాకారంతో 'ఊసులాడే హృదయాల' పేరుతో చాక్లెట్లను మార్కెట్‌లోకి ప్రవేశపెట్టింది.

ఈ విధంగా ఓ పెనువ్యాపారం ఈ ప్రేమికుల రోజు/వారం నాడు మోహరించుకుని ఉంది. **ఈ వ్యాపారీకరణ నుంచి నిజమైన ప్రేమను కాపాడుకోవడం ఓ సమస్యగానే ఉంది. అయినా తప్పదు. ప్రేమనూ, దానిలోని మానవీయ అంశనూ పాదివిపట్టి కాపాడుకోవాలి. బాల్యంలో పొందాల్సిన ప్రేమ గురించి మనం మాట్లాడాలి. యవ్వనంలో వికసించాల్సిన ప్రేమకు స్వరాలనిద్దాం. వృద్ధాప్యంలోనూ ఉండాల్సిన ప్రేమకు వారసత్వాన్నిద్దాం.**

"మీరు బాగా ఆలోచించే ఈ నిర్ణయానికొచ్చారా?" జీవితంలో తగిలిన ఏ ఎదురుదెబ్బో అనుమానమై ప్రశ్నించింది.

"ఆలోచించకుండానే నిర్ణయం తీసుకొంటారా ఎవరైనా?" స్థిరత్వం హుందాగానే అడిగింది.

"కానీ... నేను...?" బేలగా చూసిందామె.

"ఊ! నేను మాత్రం?" ఒకేబాటసారుల మధ్య వివక్షేమిటన్న విచక్షణ.

"ఉc! కానీ... మళ్లీ... ఏవైనా... కొత్తసమస్యలు?" జీవన పోరాటంలో అలసిన మనసు ఆశ నిరాశల మధ్య కొట్టుమిట్టాడుతోంది.

"ఏమిటి నీ సందేహం? కుటుంబపరంగానా? సామాజికంగానా? ఆరోగ్యపరంగానా?" సమస్యను విశ్లేషించే సాలోచన.

"అన్నీనూ...!" చేదు అనుభవాలు మనసు పొరల్లో దాగనంటున్నాయి.

"హుc! నిండా మునిగిన వాళ్ళకు చలేవిటి?" గుండెలోని వేదనకు ముసుగేస్తున్న గొంతులో ధీమా!

"నిజమే! నిండా మునిగినవాళ్ళు చలికి భయపడ్డమేమిటి?"

"భయపడ్డంకాదు. కలసి పంచుకోవటం. కలసిపోవటం. పోయేదాకా కలసి ఉండడం!" మనసుతడి... మాటల్లో!

అంతదాకా బిగపెట్టిన దుఃఖం బ్లో అవుట్!

వెక్కివెక్కి ఏడుస్తున్న ఆమెను గుండెల్లో పొదువుకొని ... చెమర్చిన కళ్ళతో అతను!

"నా పాప... పాప..." ఆర్తిగా ఆమె.

"మన పాపే! మనతోనే... మనమున్నంతదాకా!" ఆర్ద్రతగా అతను.

ఊహించని వరమే ఎదురైతే... తట్టుకోలేని ఆనందం ఉధృతం వరదలా దుఃఖమైతే... నీకోసం నేనున్నానంటూ నిశ్చింతను, ఓదార్పును నింపుతున్న గాఢ పరిష్వంగ ఆత్మీయత!

శశిరేఖా పరిణయం

యం.ఆర్. అరుణకుమారి

నే నీ పెళ్ళికి ససేమిరా ఒప్పుకోను" జగదాంబ గట్టిగా అరిచింది.

"ఏం? ఎందుకని?" ప్రశాంతంగా అడిగాడు శశి.

"మళ్లీ ఎందుకంటావేంటి? నువ్వు పెళ్ళాడతానంటే ఆడపిల్లలే కరువయ్యారా?" కోపంగా చూసిందామె.

"ఈ పిల్లకేం తక్కువటా?" నవ్వుతూనే చూశాడు శశి.

"పిల్లా?" ఈసడింపుగా అంది... "పిల్లతల్లి! పైగా ముండమోపి!"

"అందుకే కదా... నిన్ను ముత్తైదువును చెయ్యమంటున్నది!"

"నా కంఠంలో ప్రాణముండగా చెయ్యను." స్థిరంగా చెప్పింది.

"సరే... ఐతే! నన్నివ్వుడేం చెయ్యమంటారో చెప్పండి" మౌనంగా కూర్చున్న తండ్రి వైపు చూశాడు సూటిగా శశి.

"మీరొచ్చినా, రాకపోయినా రేపు గుళ్ళో మా పెళ్ళి జరుగుతుంది. పెళ్ళయ్యాక మమ్మల్ని ఇంటికి రమ్మంటారా, వద్దా... చెప్పండి". మళ్లీ

తనే రెట్టించాడు శశి తండ్రి మౌనానికి జవాబుగా.

"నేను చస్తానన్నా పెళ్ళి మానవా?" తల్లి ఆక్రోశించింది.

"ఇన్నేండ్లూ... పెళ్ళి చేసుకో అని పోరావు. ఇప్పుడు పెళ్ళి చేసుకొంటుంటే వద్దని పోట్లాడుతున్నావా?" శుష్కహాసం చేశాడు శశి.

"అదికాదురా... నీ బాగు కోసమే కదా నాన్నా! నువ్వు సంతోషంగా పదికాలాలు..."

"అమ్మా!" తల్లి కన్నీళ్ళు తుడిచాడు ఆప్యాయంగా.

"నీ మనసు నాకు తెలుసమ్మా! కానీ... ఎవరి బాగోగులు వాళ్ళ చేతుల్లోనే, 'చేత'ల్లోనే ఉంటాయని తెలుసుకొనేసరికి ఆలస్యమైపోయింది. ఇప్పుడైనా ఆకులు పట్టుకొంటున్నది కాలిన చేతులు బాగవుతాయని కాదు... ఉపశమనం... అంతే! నువ్వు నిజంగా నా సుఖసంతోషాల్నే కోరుకొనేట్లయితే పెళ్ళికొచ్చి మమ్మల్ని ఆశీర్వదించండి..." అన్నాడు. తన కళ్ళల్లో నీళ్ళు చూడ్డం తల్లికి ఇష్టం లేదు. చర చరా బయటికెళ్ళిపోయాడు శశి.

కొడుకు తెగేసి చెప్పటంతో నిర్ఘాంతపోయింది జగదాంబ.

ఒక్కగానొక్క కొడుకు పెళ్ళయిన పదేళ్ళకు పుట్టిన వరాలకొండ!

బిడ్డల కోసం నోచని నోము లేదు.

మొక్కని దేవుడు, రాయి, రప్పా, చెట్టు, పుట్టా లేదు.

మింగని మందు, మాకు, ఆకు, పసరూ లేదు. ఎంత ఆరాటం! ఎంత తపన పడింది కడుపు పండాలని!

తెల్లగా, బొద్దుగా, నల్లని ఉంగరాల జుట్టుతో వందంటి కొడుకు... ముడితే ఆనందంతో పొంగిపోయింది. అరచేతుల్లో, గుండెల్లో పెట్టుకు పెంచింది. అతిగారాబం వద్దన్న భర్త మాట చెవిలో వేసుకోలేదు. భర్త మాట చెల్లనివ్వలేదు. కొడుకు ఆడిందే ఆట! పాడిందేపాట ఫలితం!

చదువు సంధినపడింది.

వయసు చెడుసావాసాలు మరిగింది.

ఆరోగ్యం హారతి కర్పూరమైంది.

అప్పటిగ్గానీ కళ్ళు తెరిపిన పడలేదు. తల్లిగుండె తల్లడిల్లిపోయింది. బిడ్డను కాపాడమని భర్త కాళ్ళపై పడి రొమ్ముబాదుకొంది. తనకు మాత్రం బిడ్డకాదా? ప్రేమ ఉండదా? కొడుకును తీసుకొని పెద్ద పెద్ద ఆస్పత్రుల చుట్టూ తిరిగాడు. డబ్బుకు చూసుకోలేదు. చెప్పిన టెస్ట్‌లన్నీ చేయించాడు. కొడుకు ఆరోగ్య పరిస్థితికి తనలో తనే కుమిలిపోయాడు కాని భార్య తట్టుకోలేదని చెప్పలేదు.

జరిగినదానికి చేసేదేమి లేకనో, పశ్చాత్తాప కారణమో గానీ... కొడుకులో వచ్చిన మార్పు ఆమెకు ఊరట. మళ్ళీ చెడు అలవాట్లకు మళ్ళకుండా పెళ్ళి చేసేద్దామని శతపోరింది. తండ్రి పలకడు. కొడుకు ఉలకడు.

ఇంతలో హఠాత్తుగా పెళ్ళి చేసుకొంటానన్న కొడుకు మాటలు చెవుల్లో అమృతంలా, పెళ్ళి కూతురు వితంతువైన బిడ్డతల్లన్న మాట విషంలా అన్పించాయి. ఎంత చెప్పినా, బెదిరించినా కొడుకు వినలేదన్న ఉక్రోషం భర్తపైకి మళ్ళింది.

"మీరేంటి బెల్లం కొట్టిన రాయిలా! చెప్పొచ్చుకదా మీరన్నా?"

"ఏం చెప్పమంటావు? పెళ్ళాడి హాయిగా

ఉంటానంటే వద్దనమంటావా?"

"బిడ్డ తల్లితోనా?"

"కలిసొచ్చే కాలానికి నడిసొచ్చే బిడ్డనుకో! పెళ్ళవగానే తండ్రయిన అదృష్టవంతుడనుకో!"

"అయ్యో ఖర్మ! ఖర్మ!" తల బాదుకొంది జగదాంబ "ఏ జన్మలో ఏ పాపం చేశానో!"

"ఏ జన్మలో జేసినా... ఎవరి స్వయంకృతాపరాధం వాళ్ళు అనుభవించాల్సిందేకదా!" దీర్ఘంగా నిట్టూర్చి నిర్లిప్తంగా చెప్పాడాయన.

"కక్షసాధిస్తున్నారా? మీకేం బాధ్యత, బాధ లేవా?"

"జగన్నాటకంలో పాత్రధారులం! నిమిత్తమాత్రులం!"

"వేదాంతం మాట్లాడకండి" కోపంతో రగిలిపోయింది జగదాంబ

"దాని మొగుడేదో రోగాల్తో చచ్చాడట. అవన్నీ దీనికి అంటుకోనుండవా? నా బిడ్డను అన్యాయం చెయ్యటానికి ఎక్కడి నుండి దాపురించిందో శనిముండ."

"తెలిసో, తెలియకో అన్యాయమైన వాళ్ళు ఒకళ్ళకొకళ్ళు న్యాయం చేసుకొంటుంటే... మనం శనిలా అడ్డం వద్దం బాగుండదని అర్థం చేసుకోవేం?"

"నా బిడ్డ కేం తక్కువ? రాజులా..."

"ఆఁ! రాజులా తిరిగినందుకే రోగాల పుట్టయ్యాడు. కొత్తగా ఆ అమ్మాయి నుండి వచ్చేదేం లేదులే!" ఆగ్రహమో, ఆవేశమో, ఆవేదనో... గుండెలోతుల్లోంచి తన్నుకు వచ్చిన భర్త ఆక్రోశాన్ని వింటూ కుప్పకూలిందా తల్లి!

* * *

"మీ నిర్ణయం ఆశ్చర్యం, అభినందనీయం! మీ పెళ్ళి మార్గదర్శనీయం! సుఖంగా, సంతోషంగా ఉండండి." పెళ్ళికి హాజరైన అతి కొద్దిమంది సన్నిహితులు మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు.

కోటి ఆశలతో, శత కోటి కలలతో దాంపత్య జీవితంలోకి అడుగుపెట్టిన రేఖ.. పెళ్ళయిన సంవత్సరానికే భర్త ఎయిడ్స్‌తో మరణిస్తే... విధవయ్యింది. తనకు, పుట్టిన బిడ్డకూ ఎయిడ్స్ సోకిందని తెలిసి గుండెలు పగిలేలా ఏడుస్తుంటే అక్కున చేర్చుకోలేని పుట్టింటి పేదరిక అనాదరణ వెలేసింది... ఎయిడ్స్ బాధితులను ఆదుకొంటున్న స్వచ్ఛంద సంస్థ ఆదరణ పొందిన ఆమె తన తోటి ఎయిడ్స్ రోగి శశి అసాధారణ నిర్ణయంతో రెండోసారి వధువైంది. అతని ఇల్లాలయ్యింది.

"బతికినంతకాలమూ ఒకరికొకరు తోడూనీడగా ఆనందంగా ఉండండి" చివరిగా వినబడ్డ ఆశీర్వచనం విని చప్పున తలెత్తారు శశి రేఖలు.

కన్నీళ్ళతో తడిసిన అక్షింతలు వేస్తూ ఆర్తిగా ఆశీర్వదిస్తున్న శశి తల్లిదండ్రుల్ని చూసి... వాళ్ళ కళ్ళల్లో ఆనందబాష్పాలు!

"ఇంటికి వెళదాం పదండి" కోడలి చేతిలోని పాపను తీసుకొని ముద్దాడుతూ చెప్పింది జగదాంబ.

దయనీయ పరిస్థితి

అంపశయ్య నవీన్

"ఇవ్వాళ్ళ ఉదయం లేస్తూనే ఓ దుర్వార్త విన్నానోయ్"

"యేమిటో ఆ దుర్వార్త"

"నా దగ్గరి మిత్రుడు రామ్మూర్తి నీకు తెలుసుకదా"

"తెలుసు... యూనివర్శిటీలో ప్రొఫెసర్... మనింటికి చాలా సార్లొచ్చాడు. ఆయనకేమయింది?"

"చాలా ఘోరం జరిగిపోయింది. రాత్రి ఆయన భార్య చనిపోయిందట"

"నిజమా? ఆమెది చిన్న వయస్సే కదా... ఆమెను కూడా నేను చూశాను"

"ఈ రోజుల్లో చిన్న వయస్సేనని చెప్పాలి. మొన్ననే యాభై దాటాయట"

"ఆత్మహత్యా?"

"కాదు... రాత్రి పదకొండున్నర ప్రాంతంలో గుండె పోటొచ్చిందట. రావడం రావడమే చాలా ఉధృతంగా వచ్చిందట.. పది నిమిషాల్లోనే ప్రాణం పోయిందట. హాస్పిటల్‌కు ఫోన్ చేస్తే అంబులెన్స్ పంపించారట. అంబులెన్స్‌లోకి ఎక్కించేముందే ప్రాణం పోయిందట. పది నిమిషాలకు ముందు నిండుప్రాణంతో ఉన్న వ్యక్తి పదినిమిషాల తర్వాత శవంగా మారిపోవడం... ప్రాణానికి, మృత్యువుకు మధ్య సరిహద్దురేఖ ఎంత చిన్నదో చూశావా?"

"నిజమే... ఈ మధ్య ఇట్లాంటి వార్తలు చాలా వింటున్నాం. మొన్ననే మన కాలనీలో ఉండే ఈశ్వరయ్య అనే ప్రొఫెసర్ కూడా ఇలాగే చనిపోలేదూ? అతన్ని కూడా హాస్పిటల్‌కు తీసుకువెళ్తుంటే దార్లోనే ప్రాణం పోయింది".

"అవును. నాకు గుర్తుంది"

"రామ్మూర్తిగారి భార్యకు అంత్యక్రియలు జరిగాయా?"

"జరిగాయి. నేనిప్పుడు అక్కడ్నించే వస్తున్నాను."

"ఆమె కూతురు, కొడుకు అమెరికాలో ఉంటున్నారని చెప్పారు వాళ్ళొచ్చారా?"

"వాళ్ళెక్కడొచ్చారు? ఆమె చనిపోవడమే పెద్ద విషాదమంటే ఆమెను చివరిసారి చూసుకోవడానికైనా, ఆమె కనిపెంచిన పిల్లలెవరూ రాకపోవడం అక్కడున్న వాళ్లందరి హృదయాల్ని కలచివేసింది"

"వాళ్ళకు ఫోన్‌చేసి చెప్పారట్నా?"

"వాళ్లమ్మాయి ప్రస్తుతం గర్భవతిట. నెలరోజుల్లో డెలివరీ కాబోతున్నదట. ఆమెను కదలటానికి వీల్లేదని డాక్టర్లు చెప్పారట. కూతురి డెలివరీ టైంకు అమెరికా వెళ్ళేందుకు రామ్మూర్తి భార్య సిద్ధమౌతోందంట! ఇంతలోనే ఈ దారుణం జరిగింది. తల్లి చనిపోయిందన్న వార్త తెలిస్తే కూతురు చాలా బాధ పడ్తుందనీ, డెలివరీకి దగ్గర్లో ఉన్న ఆమెకీ వార్త చెప్పొద్దని చెప్పనేలేదట. ఇక ఆమె కొడుకేమో యేదో కాన్ఫరెన్స్‌లో పాల్గొనడానికి చాలాదూరం వెళ్ళాట్ట. రెండ్రోజుల దాకా ఆయన అక్కణ్ణించి కదలటానికి వీల్లేదట. అతనికి తన తల్లి మరణవార్త తెలిసినా రావటానికి వీలుకాదని చెప్పేశాట్ట"

"ఎంత ఘోరం... ఎంత ఘోరం.. కన్నతల్లి కంటె ఆ కాన్ఫరెన్సే ముఖ్యమై పోయిందా? తల్లి చనిపోయినప్పుడు కూడా రాని కొడుకు ఉంటేయేం. లేకుంటేయేం?"

"చాలా ఉన్నతస్థితిలో ఉన్నవాళ్ళ కార్యక్రమాలన్నీ ఎంతో ముందుగానే నిర్ణయమైపోతాయి. ఆహ్వానాలు ప్రింటయిపోతాయి. చాలా పెద్దఎత్తున ఏర్పాట్లు జరుగుతాయి. అందుకని వాటిని మార్చడానికి వీలుండదు. అందులోనూ అమెరికా నుండి ఇక్కడికి ఉన్న పళంగా రావాలంటే చాలా కష్టం."

"అసలు పిల్లల్ని అమెరికాకెందుకు పంపించాలండీ. తల్లిదండ్రులే పిల్లల్ని అమెరికాకు వెళ్ళండని ప్రోత్సహిస్తున్నారు. మా పిల్లలు అమెరికాలో ఉన్నారని చాలా గర్వంగా చెప్పుకుంటున్నారు. ఏమిటీ పిచ్చి? ఇట్లా ఊహించనిదేదైనా జరిగినప్పుడు అక్కడ్నించి ఇక్కడికి రావడం ఎంతకష్టం. ఇలాంటి సమయంలో కనిపెంచిన వాళ్ళను కడసారి చూసుకోవడానికైనా రాకపోవడం ఎంత ఘోరం..."

"నిజమే... కానీ పరిస్థితులలా మారిపోతున్నాయి. మీ పిల్లల్ని అమెరికాకెందుకు పంపించారని వాళ్ళ తల్లిదండ్రుల్ని అడిగితే... ఇక్కడుంటే యేముందండీ? అని సమాధానం చెబుతారు. ఇక్కడసలు ఉద్యోగాలే దొరకవు. దొరికినా వచ్చే జీతం చాలా తక్కువ. ఇక్కడ ఎవ్వరూ పనిచెయ్యరు. ఇక్కడ వర్క్‌కల్చర్ అనేదే లేదు. పని చేసేవాడిని, పనిచెయ్యనివాడిని ఒకేలాగ చూస్తారు. కానీ అమెరికాలో పరిస్థితులిలా ఉండవు. పనిచెయ్యనివాడు అక్కడ ఒక్కరోజు కూడా ఉద్యోగంలో ఉండలేడు. పని చేసేవాడికి చాలా ప్రోత్సాహం ఉంటుంది. కాబట్టి కష్టపడి పనిచేసేవాడు చాలా సంపాదించే అవకాశం ఉంటుంది. ఇవన్నీ అమెరికాకు వెళ్ళేవాళ్ళు చెప్పే కారణాలు"

"సంపాదించి యేం చేసుకుంటారు. నెత్తిన కట్టుకుంటారా? పోయేటప్పుడు తీసుకుపోతారా? సంపాదించడానికి అంతమంటూ ఉండందా? ఇక్కడున్నవాళ్ళు మాత్రం అంతో ఇంతో సంపాదించడం లేదా? అమెరికాకు వెళ్ళినవాళ్ళే సంపాదిస్తున్నారా? కష్టమొచ్చినా, సుఖమొచ్చినా మన పిల్లలు మన దగ్గరుండటంలో ఎంత ఆనందముంటుందో వీళ్ళకు తెలియదా?"

"ఎందుకు తెలియదు. తెలుసు..."

"తెలిసినా ఎందుకీ పరుగు?"

"ఉన్నతస్థితికి ఎదగాలన్న కోరిక అన్నింటినీ మరిపిస్తుంది. ఇవ్వాళ చాలామంది తల్లిదండ్రులు ఒక దశలో తమ పిల్లల్ని ఎంతో సంతోషంగా అమెరికాకు పంపిస్తున్నారు. కొంతకాలం గడిచాక వాళ్ళకు వృద్ధాప్యం వచ్చేస్తుంది. భార్యభర్తలిద్దరే బిక్కుబిక్కుమంటూ ఇక్కడుండిపోతారు. వృద్ధాప్యం పెరుగుతున్నకొద్దీ వాళ్ళ సమస్యలు పెరిగిపోతుంటాయి. అమెరికాకు వెళ్ళిన వాళ్ళు సాధారణంగా తిరిగి ఇండియాకు రారు. ఏ కొద్దిమందో తమ తల్లిదండ్రుల్ని అమెరికాకు రమ్మంటారు. వీళ్ళేమో అక్కడకు వెళ్లలేరు. వెళ్ళినా ఎక్కువకాలం అక్కడ ఉండలేరు. అక్కడి పరిస్థితులకు అనుగుణంగా మారలేరు. వీళ్ళు ఇండియాలోనే ఉండిపోతారు. వాళ్ళు అమెరికాలోనే ఉండిపోతారు. జీవితపు అంతిమదశలో కూడా ఒకర్నొకరు చూసుకోలేని దయనీయ పరిస్థితి ఏర్పడుతుంది."



స్వేచ్ఛకు మార్గం

మేకల మదన్‌మోహన్‌రావు

కొన్ని వందల సంవత్సరాల క్రితం బర్మా దేశంలో ఒక ధనిక వర్తకుడు వుండేవాడు. అతడు భారతదేశంలో రకరకాల వస్తువులు, సుగంధ ద్రవ్యాలు కొని, తన దేశంలో అమ్మేవాడు. అలా తరచూ భారతదేశానికి వస్తూ వుండేవాడు. వచ్చిన ప్రతిసారీ బంధుమిత్రుల కోసం రకరకాల కానుకలు తీసుకెళ్లేవాడు.

ఆ వర్తకుని ఇంట్లో భారతదేశపు చిలుక ఒకటి వుండేది. అతను దాన్ని పంజరంలో పెట్టి అపురూపంగా చూసుకునేవాడు. కానీ చిలుకకు స్వేచ్ఛగా విహరించడమంటే ఇష్టం. ఆ అవకాశం లేకపోవడంతో అది ఎప్పుడూ విచారంగా వుండేది. అయితే వర్తకునికి అదంటే వల్లమాలిన ప్రేమ. దానికి మాట్లాడటం, ప్రార్థించడం, తమ దేశ భాషల్లో పాడడం నేర్పాడు.

ఒకరోజున ఆ వర్తకుడు చిలుకతో, "నేను రేపు మీ దేశానికి వెళ్తున్నాను. రెండు నెలల తర్వాత తిరిగి వస్తాను. అక్కడి నుండి నీకేం కానుక తెమ్మంటావు?" అని అడిగాడు.

"కృతజ్ఞతలు ప్రభూ! నాకే కానుకా వద్దు. కానీ ఒక చిన్న సహాయం చేయండి. మీకు మా దేశంలో ఎన్నో అడవి చిలుకలు కనిపిస్తాయి. వాటితో 'మీరు మీ దేశంలో స్వేచ్ఛగా ఎగురుతున్నారు. కానీ మీ బంధువు ఒకరు పరాయి దేశంలో పంజరంలో బందీగా పడివున్నారు" అని చెప్పండి అంది. "అలాగే" అని వాగ్దానం చేశాడు వర్తకుడు.

ఆ తర్వాత ఆయన భారతదేశం వెళ్లి, వెనక్కి బయలుదేరాడు. దారిలో ఒక తోటలో ఆయనకు ఓ చిలుకల గుంపు కనిపించింది. అప్పుడు అతనికి తన చిలుక చెప్పిన విషయం గుర్తుకొచ్చింది. వాటి దగ్గరకెళ్లి, "ఓ భారతీయ చిలుకలారా! మీకొక సందేశం. అది మీ బంధువుది. 'మీరు మీ దేశంలో స్వేచ్ఛగా ఎగురుతున్నారు. కానీ మీ బంధువు మాత్రం పరాయిదేశంలో పంజరంలో బందీగా వుంది" అని బిగ్గరగా అరిచి చెప్పాడు.

ఆ పక్షులు ఒకసారి ఆయన వైపు చూసి, చెప్పింది విన్నాయి. కానీ బదులు పలకలేదు. అప్పుడు అకస్మాత్తుగా ఒక వృద్ధ చిలుక చచ్చిపోయి, చెట్టు మీది నుండి కిందపడింది. అది చూసి వర్తకుడు, 'బహుశా ఇది నా చిలుకకు దగ్గరి బంధువై వుంటుంది. అందుకే అది పంపిన సందేశం విని గుండె పగిలి చనిపోయింది' అనుకున్నాడు బాధగా. తన దారిన తాను ప్రయాణమయ్యాడు.

ఇంటికి వచ్చిన తర్వాత చిలుక దగ్గరకు వెళ్లాడు.

"నాకేమన్నా సందేశం తెచ్చారా?" ఆశగా అడిగింది చిలుక.

"లేదు. ఏ సందేశమూ తీసుకురాలేదు. కానీ ఒక దుర్వార్త తెచ్చాను. భారతదేశంలో ఒక తోటలోని ఒక చిలుకల గుంపుకు నీ సందేశం చెప్పాను. కానీ అవేవీ బదులు పలుకలేదు. ఒక వృద్ధ చిలుక మాత్రం అకస్మాత్తుగా చెట్టు మీది నుండి కిందపడి చచ్చిపోయింది. బహుశా అది నీకు చాలా దగ్గరి చుట్టమై వుంటుంది" అని చెప్పాడు.

ఆయన చెప్పిందంతా విన్న ఆ చిలుక పంజరంలో తాను కూర్చున్న ప్రాంతం నుండి కిందపడి, కదలకమెదలక వుండిపోయింది. వర్తకునికి ఆశ్చర్యమూ, బాధా కలిగాయి. కొద్దిక్షణాలపాటు దాని దగ్గర అలాగే నిశ్చేష్టుడై నిలబడిపోయాడు. "పాపం! ఆ వార్తకు తట్టుకోలేక చచ్చిపోయింది" అని నిట్టూర్చాడు. పంజరం తలుపు తెరిచి, దాన్ని నెమ్మదిగా నేల మీద పడుకోబెట్టాడు.

"నా తోటలో నిన్ను సమాధి చేస్తా ప్రియ నేస్తామా!" అని దుఃఖించాడు.

అప్పుడు ఓ విచిత్రం జరిగింది. చిలుక అకస్మాత్తుగా గాల్లోకి ఎగిరి, దగ్గర్లోని చెట్టు చిటారు కొమ్మ మీద వాలింది. "అయ్యా! మీకు తెలియకుండానే నాకు మీరొక సందేశం తెచ్చారు. అదేంటంటే... ఆ వృద్ధ చిలుక చెట్టు మీద నుండి పడిపోయి చనిపోయినట్టుగా నటించింది. నిజానికది పడిపోలేదు. చనిపోలేదు. అట్లా అది మీతో నాకొక సందేశాన్నిచ్చి పంపింది. స్వేచ్ఛకు మార్గం ఇదే.

మీరు నా పట్ల చాలా దయ చూపించారు. కానీ మీ ఇంట్లో నేనొక బందీని. అందువల్ల నాకే సంతోషం లేదు. ఇప్పుడు నేను మిగతా పక్షుల్లా సంతోషంగా, స్వేచ్ఛగా వున్నాను. ఆ సందేశాన్ని పంపిన వృద్ధ చిలుకకు, దాన్ని నాకు అందించిన మీకు నా కృతజ్ఞతలు. సెలవు" అంటూ భారతదేశం వైపు రివ్వున ఎగిరిపోయింది.

☆☆



వి'చిత్రం'



హాయ్ సీమటపాకాయలూ... ఈ వారం వి'చిత్రం' చూశారుగా. ఇంతకీ ఆ బొమ్మలో ఏం కనిపిస్తున్నాయర్రా? బాగా చూసి చెప్పండి. ఏంటి? నోరు మెదపరు? పోనీ మాకేమనిపిస్తోందో చెప్పమంటారా? అదో పెద్ద అడవిలా వుంది. పెద్ద పెద్ద చెట్లు, కొండలు కనిపిస్తున్నాయి. ఓ పేద్ద చెట్టుని పాపం నరికేశారు. అదేమో ఓ పక్కకు ఒరిగి వుంది. వీటన్నిటినీ ఓ అమ్మాయి ఎంతో ఆసక్తిగా చూస్తోంది. అవునా! మీకు ఇంతకంటే భిన్నంగా ఏమన్నా కనిపిస్తున్నాయా? అంతేనా! కానీ మనందరి కంటికి అగుపించని, లేదా మనం పసిగట్టలేని అసలు విషయం వేరే వుందంట. ఏంటో తెలియాలంటే... జవాబు చూడండి.

జవాబు

ఇందాక మనం పేద్ద చెట్టు ఒకటి నరికేశారనుకున్నామే. అదేంటనుకున్నారు? ఓ వ్యక్తి ఊదుతున్న మురళి. దాన్ని ఓ చేయి పట్టుకుంది. కనిపించిందా! ఇప్పుడు అదే చెట్టు వంక చివరిదాకా చూడండి. అక్కడ సరిగ్గా ఓ వ్యక్తి మొహం కనిపిస్తుంది. ఇప్పుడేమర్థమైంది మీకు.... ఆ అమ్మాయి ఆ వ్యక్తి ఆలపిస్తున్న మురళీగానాన్ని ఆస్వాదిస్తోందన్నమాట. ఓకేనా!

బాలనేస్తాలు

బన్నీ గాలిపటం ఏది?



ఈ బొమ్మలో గాలిపటం ఎగరేస్తున్నాడే ఆ పిల్లవాడి పేరు బన్నీ. వాడితో పాటు వాడి స్నేహితులు కూడా గాలి పటాలు ఎగరేశారు. చివరికి అన్నీ కలిసిపోయి తికమకగా తయారైంది. ఎవరిది ఏ గాలిపటమో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఇంతకీ బన్నీ గాలిపటం ఏదో కనుక్కోండి చూద్దాం.

ఎగిరే సీతాకోకచిలుక!



చిట్టిపొట్టి చిన్నారులూ... వారం వారం మనం చెప్పకుంటున్న **పేపర్‌తో బొమ్మలు** మీకు బాగా నచ్చాయనుకుంటున్నాం. అలాగని చాలామంది ఉత్తరాల ద్వారా చెప్పారు కూడా. ఈ వారం మనం ఎగిరే సీతాకోకచిలుకను ఎలా తయారుచేయాలో చెప్పకుందాం. సరేనా!

అందుకోసం ఏమేం కావాలంటే... మందపాటి తెలుపు కాగితం, పెన్సిల్, క్రేయాన్లు (స్కెచ్ పెన్నులు). **ఎలా చెయ్యాలంటే...** ముందుగా మీరు ఎంతసైజు సీతాకోక చిలుకను చెయ్యాలనుకుంటున్నారో అంత కాగితం తీసుకోండి. దాన్ని మధ్యకు మడవండి. మడతకు





రెండు వైపులా పెన్సిల్‌తో సీతాకోక చిలుక రెక్కల ఆకారం గియ్యాలి. తర్వాత సరిగ్గా దాని చుట్టూరా కత్తిరించాలి. అంటే మనం సీతాకోక చిలుక రెక్కల చుట్టూ వున్న తెల్లటి కాగితాన్ని తీసేస్తున్నామన్నమాట. ఇప్పుడు మడత విప్పి చూడండి. మన చేతిలో సీతాకోకచిలుక ఆకారంలో వున్న తెలుపు కాగితం వుంటుంది. అవునా! ఇప్పుడేం చెయ్యాలంటే... ఇలాంటి సీతాకోక చిలుకలను బోలెడన్ని తయారుచెయ్యాలి. వీటిమీద మీకు నచ్చిన డిజైన్లు గియ్యండి. వాటికి మీ మనసుకు నచ్చే రంగులు వెయ్యండి. సీతాకోక చిలుకకు యాంటెన్నాలు



వుంటాయి కదా. మరి అవి చెయ్యడం ఎలా? అందుకోసం రెక్కల పై భాగంలో రెండు చిన్న రంధ్రాలు పెట్టండి. వాటికి చిన్నచిన్న దారాలు కట్టండి. ఇప్పుడు ఆ రెండు దారాలను కలిపి ముడివెయ్యండి. అంతే ఎగిరే సీతాకోకచిలుకలు రెడీ. వీటిని మీ ఇంట్లో ఎక్కడైనా వేలాడదియ్యవచ్చు. తమ్ముడు, నాన్న వాళ్ల చొక్కాలు తగిలించుకునే హేంగర్లు కనుక మీ ఇంట్లో వుంటే మరింత మంచిది. ఈ హేంగర్‌కు సీతాకోకచిలుకలు కట్టేసి ఇంటి మధ్యలో ఎక్కడైనా వేలాడదియ్యొచ్చు. గాలి కొట్టినప్పుడల్లా హేంగర్ అటూ ఇటూ కదులుతుంది. దాంతో పాటు సీతాకోకచిలుకలు కూడా వయ్యారంగా ఊగుతాయి. చూడముచ్చటగా వుంటుందిలే. చేస్తే మీకూ ఆ విషయం తెలుస్తుంది. మరి ఈ వారానికి టాటా. వచ్చేవారం మరో మంచి కాగితపు బొమ్మను ఎలా చెయ్యాలో చెప్పేసుకుందాం. అందాకా సెలవ్.

వీరి వీరి గుమ్మడిపండు... వీరి పేరేమి?

చిన్నారులూ!

ఈ వారం 'వీరి వీరి గుమ్మడి పండు వీరిపేరేమి'లో గొప్ప విద్యావేత్త వచ్చారు. ఏంటి అప్పడే ఆయన ఎవరో తెలిసిపోయిందా! అర్రే గుర్తించడం కష్టమనుకున్నామే. సరే. యమ అర్జంటుగా ఏం చెయ్యాలంటే... కార్డు తీసుకుని ఆయన పేరు రాసి పోస్టు చేయాలి. సరైన సమాధానం రాస్తే మీ పేరు, తరగతి, ఊరు ప్రచురిస్తాం. అన్నట్టు మీ నేస్తాలను కూడా ఈ శీర్షికలో పాల్గొనమని చెప్పండే. మరి మా చిరునామా: **వీరి పేరేమి?** బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్‌నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.



సరైన సమాధానం రాసినవారు

(బ్రాకెట్‌లోని అంకె వారు చదువుతున్న తరగతి)

పి.సూర్యప్రకాశరావ(8), శంభునిగూడెం. జయశ్రీ (7), చిలకలూరి పేట. పి.సాధన (ఎల్‌కెజి), పి.మాధురి (1), విశాఖపట్నం. ఎం.కీర్తి (6), లింగంగుంట్ల. ఎ.అనితాలక్ష్మి (5), భట్టిప్రోలు. టి.శ్రీనివాస్ (9), అంకిరెడ్డిపల్లి. సిహెచ్ అపర్ణ (8), మధిర. జి.మల్లీశ్వరి (9), పెంట్లం. డి.ఎన్.సరళ (10), శెట్టూరు. జి.సోంబాబు (10), వి.అమ్మతల్లినాయుడు (9), గంగుబూడి. జి.లక్ష్మణ్ (10), జి.తేజ (6), జి.రాఘవేంద్ర (9), వనపర్తి. ఎస్.పురుషోత్తం (9), చందాపూర్. బి.రజిత (10), రంగపేట, డి. కల్పలత (9), బాలికల వసతి గృహము, రంగపేట, ఆదిలాబాద్.కె.సుధీర్ (6), కె.సింధు (2), ఖమ్మం. డి.రామకృష్ణ, జి.లక్ష్మణ్, డి.వహేద్, ఎన్.ఉమ్లానాయక్ (10), సున్నిపెంట. కె.సన్ని (8), కె.సింధు (6), కె.గీత (5), కె.భాను (7), ఈమని. కె.హజరత్ (9), వెలిగొండ్ల. జి.సాయిభరత్‌రెడ్డి (6), మోదుకూరు. జి.ఈశ్వరమ్మ, జి.సుష్మా ఉదయశ్రీ, డి.కళ్యాణి (7), జి.ప్రదీప్‌కుమార్ (10), జి. మాధవి (8), జి.తేజ (6), వనపర్తి. ఆర్.నరేష్ (9), బల్మూర్.

గతవారపు జవాబు:
సెరీనా

చిన్నారి చిత్రకారులు



యు.ఉరుకుందు,
7వ తరగతి, ఎం.పి.యు.పి స్కూల్, కల్లకుంట, పెద్దకడబూర్.



టి.మృదుల, 9వ తరగతి,
జెడ్‌పిఎస్ఎస్ గరల్స్ హైస్కూల్,
వైరా, ఖమ్మం.

లాభం ఎంత?

చాన్నాళ్లనాటి మాట. అప్పుడు మాకు తెలిసిన ఓ పెద్దాయన రష్యా వెళ్లాడు. ఆయన ఎంతో ఉత్సాహంగా అక్కడి పట్టణాలు, పల్లెటూళ్లు, ఆస్పత్రులు, స్కూళ్లు, ఫ్యాక్టరీలు, తోటలు... అన్నీ తిరిగి చూడసాగాడు. అలా ఓ స్కూలుకెళ్లినప్పుడు ఓ పాపతో మాట్లాడాడు. ఈయనకేమో లెక్కలంటే మా ఇష్టం. అందుకని ఆ పాపని ఓ లెక్క అడిగాడు. అదేంటంటే... 'పాపా! లీటరు పాలు ఒక రూబుల్ అనుకో. లీటరు పాలల్లో అర లీటరు నీళ్లు కలిపి అమ్మామనుకో. ఎంత లాభం వస్తుంది?' అని. దానికి పాప ఏమని సమాధానం చెప్పింది? మీరు చెప్పకోండి చూద్దాం. జవాబు పై వారం.

రైతు ఏం చేశాడు?

జవాబు:

రైతు ముందుగా మేకను అవతలి ఒడ్డుకు తీసుకెళతాడు. దాన్ని అక్కడే వదిలి... తను మాత్రమే వెనక్కి వెళ్లి క్యాబేజీ బుట్ట తీసుకుని తిరిగి మేక వున్న వైపుకి వెళతాడు. అక్కడ క్యాబేజీ బుట్ట పెట్టి మళ్లీ మేకను తీసుకుని నక్క వున్న వైపుకి వెళతాడు. తిరిగి మేకను అక్కడే వదిలి నక్కను తీసుకుని ఇవతలి ఒడ్డుకి చేరతాడు. దాన్ని అక్కడే వదిలి వెనక్కి వెళ్లి మేకను తీసుకుని అవతలి ఒడ్డుకు వెళతాడు. రైతు అలా మూడిటినీ తీసుకుని ఇంటికెళతాడు.

గ్రీటింగ్స్ వీరుడు

పొత్తూరి రాజేంద్రప్రసాద్‌వర్మ

ప్రేమికుల రోజు.

యువతీ యువకులు ఆనందోత్సాహాల్లో మునిగి పోయారు.

పార్కుల్లోనూ పబ్‌ల్లోనూ ఎక్కడ చూసినా జంటలు జంటలుగా సంచరిస్తున్నారు. తమకు ఇష్టమైన వారితో ఆ రోజు గడిపితే జీవితాంతం ఆనంద మయంగా ఉంటుందని చాలా మంది నమ్ముతారు.

అందుకే పరస్పర అభినందనలతో ముంచెత్తుతున్నారు.

రామకృష్ణాబీచ్ కళకళలాడుతోంది.

ఎంతోమంది సాయంత్రం కావడంతో అక్కడికి చేరుకున్నారు.

గుంపులు గుంపులుగా కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

అభిరామ్ మాత్రం ఒంటరిగా కూర్చున్నాడు.

అరగంట నుంచి స్వప్న కోసం ఎదురుచూస్తున్నాడు.

స్వప్న అభిరామ్ మనసు గెలుచుకున్న ఫ్రెండు. పరిచయం అయిన తక్కువ కాలంలోనే ఒకరి గురించి మరొకరు బాగా అర్థం చేసుకున్నారు. ఆలోచనలు కలిశాయి. అభిరుచులు కలిశాయి. అభిప్రాయాలు కలిశాయి.

అందుకే ఇద్దరూ ప్రేమికులయ్యారు.

ప్రేమికులరోజు సాయంత్రం బీచ్‌లో కలుసుకోవాలని చాలారోజుల ముందుగానే అనుకున్నారు. అందుకే అభిరామ్ అనుకున్న సమయానికన్నా ముందే చేరుకున్నాడు.

"స్వప్న వస్తుందా?" మనసులోనే సందేహం.

తనకి తాను సమాధానం చెప్పుకోలేకపోయాడు.

చేతిలో గ్రీటింగును కవరులోంచి బైటికి తీసాడు.

అందమైన పూలగుత్తి కలిగిన బొమ్మ ఉంది. పూల కుండీలోంచి రకరకాల పూలు నలువైపులా తొంగిచూస్తున్నట్లున్న ఆ చిత్రం ఎంతో ఆకర్షణీయంగా ఉంది.

లోపల ఎర్రని అక్షరాలు.

అభిరామ్ ఏరికోరి ఆ గ్రీటింగ్ కార్డును ఎంపిక చేశాడు.

ఆర్చీస్ కంపెనీకి చెందినది. ఇతర గ్రీటింగ్ కార్డులకన్నా ఎంతో ప్రత్యేకంగా ఉంటుంది. అందులో ప్రింటయిన సందేశం కూడా ఎంతో ఆకర్షణీయంగా ఉంది.

ప్రేమికుల కోసం ప్రత్యేకంగా రూపొందించినది.

"ప్రేమ... నిజం..అభిమానం నిజం... నిన్ను ప్రేమించడం శాశ్వతం. ప్రేమ అజరామరం.. శాశ్వతం.. మన మొదటి కలయిక ప్రేమ సామ్రాజ్య సౌధానికి పునాది. మనం కలుసుకున్న ప్రతిసారీ ప్రేమలో గాఢత పెంపొందుతుంది. మన ప్రేమ ఎప్పటికీ చెరిగిపోని సిరా..." ఇంగ్లీషులో అందమైన అక్షరాలతో రాసిఉంది.

అభిరామ్ ఏరికోరి ఎంపిక చేశాడు.

ARCHIES ONLINE.com



స్వప్న విషయంలో తన మనసులో అభిప్రాయాలు ఎలా ఉన్నాయో గ్రీటింగ్‌కార్డులో అక్షరాలు కూడా అదే విధంగా ఉన్నాయి.

అభిరామ్ వాచీ చూసుకున్నాడు.

ఆరుగంటలకు ఏడు నిమిషాలు తక్కువ.

చిరుచీకటి కమ్ముకొంటోంది.

అప్పుడు కనిపించింది స్వప్న.

తెల్లటి చుడీదార్ వేసుకుని ఎగురుతున్న ముంగురుల్ని వెనక్కి తోసుకుంటూ... ఇసుకలో నడుచుకుంటూ వస్తోంది.

అభిరామ్ కళ్లల్లో మెరుపులు.

"సారీ! కాస్త లేట్ అయింది!" అంటూ చేతిలో గ్రీటింగ్‌ను అందించింది. తన చేతిలో ఉన్న గ్రీటింగ్‌ను అప్రయత్నంగా అందించి, స్వప్న గ్రీటింగ్‌ను ఆతృతగా అందుకున్నాడు.

ఆశ్చర్యం అది కూడా ఆర్చీస్ కంపెనీకి చెందినదే.

మేటర్ మాత్రం కాస్త తేడాగా ఉంది.

ప్రేమికుల కోసం తయారు చేసినది కావడంతో ప్రేమ గొప్పతనాన్ని తెలియజేసే సందేశం ఉంది.

పరస్పరం థాంక్స్ చెప్పుకున్నారు.

పక్కనుంచి వెళుతున్న బండిని ఆపి రెండు ఐస్‌క్రీములను కొని ఒకటి స్వప్నకు అందించాడు.

స్వప్న ఐస్ అందుకుంటూ– "గ్రీటింగ్‌లో మేటర్ అద్భుతంగా ఉంది. నీ సెలక్షన్ సూపర్" అని అభినందించింది.

అభిరామ్ ముసిముసి నవ్వులు నవ్వాడు.

"ఈ గొప్పతనం నాది కాదు. ఈ గ్రీటింగ్‌కార్డులు తయారు చేసిన కంపెనీది... ప్రపంచంలో ఎంతోమందిని ఆకట్టుకొంటూ లక్షల్లో వ్యాపారం చేసే కంపెనీనీ అందరూ అభినందించాలి. ప్రతి కార్డు వెనుకా 'ఆర్చీస్' అని ఉంటుంది. నాకూ మొదట తెలియదు. తెలిసిన తర్వాత మరియే ఇతర గ్రీటింగ్‌కార్డులు కొనబుద్ధికాదు. అందుకే ఏ ఆకేషన్‌కైనా ఈ కార్డులే కొంటాను".

"అంత గొప్పదా కంపెనీ?"

"కంపెనీ గొప్పతనం కాదు. దానిని స్థాపించిన వ్యక్తిది ఆ గొప్పతనం. ఏమీ లేనితనం నుంచి లక్షలాది మందిని ఆకర్షించిన వ్యక్తికి ఎంతో ప్రత్యేకత ఉంటుంది కదా?" అభిరామ్ చెప్పాడు.

"ఎవరతను?"

"అనిల్ మూల్‌చందానీ!"

* * *

అనిల్ మూల్‌చందానీ చాలా సామాన్యమైన మధ్యతరగతి వ్యక్తి. బ్రతకడానికి ఎన్నో ప్రయత్నాలు చేశాడు. రకరకాల వ్యాపారాలు ప్రారంభించాడు. ఎందులోనూ కలిసి రాలేదు.

1970లో ఢిల్లీలో బజార్ స్ట్రీట్‌లో చిన్న చీరల కొట్టును ప్రారంభించాడు. పెద్ద హోల్‌సేల్ షాపుల నుంచి చీరలను కొనుగోలుచేసి తీసుకుని వచ్చి షాపులో పెట్టేవాడు. మధ్య తరగతి మహిళల్ని ఆకట్టుకోవడం ద్వారా వ్యాపారాన్ని అభివృద్ధి చేయడానికి శ్రీకారంచుట్టారు.

చాలాకాలం అతని వ్యాపారం చుక్కానిలేని నావలా సరిగా ముందుకు కదలలేదు. కుటుంబపోషణకు మాత్రం అంతో ఇంతో మిగిలేది. వచ్చిన సొమ్మును దాచుకోవడానికి కూడా అవకాశంలేని విధంగా అవసరాలు కూడా పెరిగిపోయాయి.

1979లో జరిగిన ఒక సంఘటన అనిల్ మూల్ చందానీ జీవితాన్ని మలుపు తిప్పింది. అతని ఆలోచనల్లో మార్పుకు శ్రీకారం చుట్టింది. కొత్త జీవితానికి అడుగులు వేయడానికి అవకాశం కలిగించింది.

విదేశీయులు కొందరు మార్కెట్‌చేస్తూ అనిల్ బట్టల షాపు ముందుకు వచ్చారు. వారి చేతుల్లో రకరకాల రంగుల పోస్టర్లు ఉన్నాయి. మంచి మంచి చిత్రాలతో అందంగా ఉండటంతో చూసేవారిని ఆకట్టుకుంటున్నాయి.

"వీటిని కొనగలరా?" గుంపులో అమ్మాయి అడిగింది.

అనిల్ మూల్‌చందానీకి మొదట ఎందుకులే అనిపించింది. తర్వాత తన బట్టల షాపుముందు అద్దాల బీరువాలో పెడితే అలంకారప్రాయంగా ఉంటుందని

అభిప్రాయపడ్డాడు. వెంటనే వారు తీసుకువచ్చిన రకరకాల వాల్‌పోస్టర్లన్నీ కొనుగోలు చేశాడు.

వాటిని షాపు ముందు అందంగా అమర్చాడు.

వాటి అలంకరణతో బట్టల షాపుకు కొత్తకళ వచ్చింది.

వచ్చిపోయేవారు షాపు వద్ద ఆగి మరీ వాల్‌పోస్టర్లను చూసేవారు. చూడటానికి ఎంతో బాగుండటంతో చాలామంది చీరల షాపులో చీరలకన్నా ఈ బొమ్మల పట్లే ఎక్కువ ఆకర్షితులయ్యేవారు. కొంతమంది అయితే "ఈ పోస్టర్లు అమ్మకానికేనా?" "మాకు అమ్ముతారా?" "ఎంత ఖరీదు" "ఇటువంటివి ఇంకా ఉన్నాయా?" వంటి రకరకాల ప్రశ్నల వర్షం కురిపించేవారు.

వారి మాటలు అనిల్‌లో ఆలోచనల్ని రేకెత్తిచ్చాయి.

చీరల వ్యాపారంతో బాటు ఈ వాల్ పోస్టర్ల వ్యాపారం ఎందుకు చేయకూడదూ అనుకున్నాడు. అనుకున్నదే తడువుగా అందుకు తగిన ప్రయత్నాలను మొదలుపెట్టాడు. కొన్ని విదేశీ పోస్టర్లను, పాశ్చాత్య గీతాల ఆల్బమ్‌లను, సీడీలను తీసుకుని వచ్చి అమ్మడం మొదలుపెట్టాడు. చాలామంది కొనుగోలుదారులు వీటి పట్లే విపరీతంగా ఆకర్షింపబడేవారు.

బట్టలషాపును నిర్వహిస్తూనే షాపుకు ఒక మూలన ఇవన్నీ అమ్ముకుంటూ సైడ్ బిజినెస్‌గా అభివృద్ధి చేశాడు.

కొన్నాళ్ళకే ఆ ప్రాంతంలో యువతీ యువకులకు మూల్‌చందానీ షాపు ఒక ప్రత్యేక ఆకర్షణగా మారిపోయింది. ఎవరిదగ్గరాలేని వాల్‌పోస్టర్లు, బొమ్మలు ఇక్కడ లభించడంతో దూరప్రాంతాల నుంచి కూడా ఎంతోమంది విచ్చేసేవారు.

పదేళ్ళ నుంచి చీరల వ్యాపారం చేస్తున్నా అందులో లభించని గుర్తింపు ఏడాది కాలంలోనే బొమ్మలు, చిత్రాల వ్యాపారంలో లభించింది. దీంతో దీనిపైన ఎక్కువ దృష్టికేంద్రీకరించాలని నిర్ణయించుకున్నాడు.

చీరలషాపు ప్రత్యేకంగా నిర్వహించడం కష్టం అవుతుందని దానిని అమ్మివేశాడు. చీరల షాపు బదులు కొత్త వ్యాపారానికి శ్రీకారం చుట్టాడు. తనలో అంతవరకూ వెలికిరాకుండా ఉండిపోయిన సృజనాత్మక శక్తులనన్నింటినీ వెలికితీశాడు. కొత్త రకాలైన ఆలోచనలను ఆవిష్కరించాడు. కొత్తగా ప్రారంభించిన వ్యాపారం వినూత్నంగా ఉండాలని తన శక్తి యుక్తులన్నీ చూపించాడు.

ఫలితంగా "ఆర్చీస్" ఆవిర్భవించింది.

గ్రీటింగ్ కార్డుల తయారీ ప్రధానంగా ఈ సంస్థ పనిచేయడానికి వీలుగా కృషి ప్రారంభించాడు. ఏయే సందర్భాలలో ఇతరులకు గ్రీటింగ్‌కార్డులు అందజేస్తారో అన్ని సందర్భాలకు సంబంధించి కార్డులు రూపకల్పన చేశాడు. పక్షులు, పూలు, పళ్ళు, ప్రకృతి.. వర్ణచిత్రాలు.. మంచి దృశ్యాలు.. పట్టణాలు.. పల్లెలు ఒకటేమిటి రకరకాల బొమ్మలతో గ్రీటింగ్‌లు తయారైపోయాయి. ఫొటోలతో కొన్ని, వర్ణచిత్రాలతో కొన్ని రూపొందించాడు. ఎంతో మంది ఆర్టిస్టులు ఫొటోగ్రాఫర్ల సహాయ సహకారాలను తీసుకున్నాడు.

కార్డుల తయారీ ఎవరైనా చేస్తారు.

కొన్నింటిని మాటల్లో చెప్పలేం. మనసును మాటల్లోకి అనువదించలేం, లవ్, ఫ్రెండ్‌షిప్, ఇష్టం, అభిమానం వంటి ఫీలింగ్స్ చెప్పడం చాలా కష్టం. గుండె గొంతుకలో కొట్లాడే భావాలకు అక్షరరూపం ఇవ్వడం గ్రీటింగులకే సాధ్యం. దీనిని అనిల్ మూల్‌చందానీ గమనించాడు. అందుకే గ్రీటింగ్ కార్డులలో రకరకాల మేటర్లు తయారు చేయించాడు. అందమైన గ్రీటింగ్ కార్డులు విప్పితే మరింత అందమైన మాటలపొందిక ఆకట్టుకొనేలా ఉండేది.

అంతవరకూ గ్రీటింగ్ కార్డులంటే అందమైన ఖరీదైన చిత్రాలుగానే అందరూ భావించేవారు. సింపుల్ పదాలతో శుభాకాంక్షలు అని ఉండే అక్షరాలు ఆకర్షించడం మానేశాయి. 'ఆర్చీస్' గ్రీటింగ్ కార్డులు మార్కెట్‌లోకి రాగానే వివిధ వర్గాలకు చెందినవారు సందర్భానుసారం పంపించడానికి వీలుగా ఉండే గ్రీటింగ్‌కార్డులను ఎంపిక చేసుకునే అవకాశం లభించింది.

యువతరాన్ని ఇవి విశేషంగా ఆకట్టుకున్నాయి.

మూల్‌చందానీ మొదట చిన్నసైజు పరిశ్రమగా గ్రీటింగ్‌కార్డుల డిస్ట్రిబ్యూషన్ ప్రారంభించాడు. అయితే కుప్పలు తెప్పలుగా వస్తున్న ఆర్డర్లను తట్టుకోవడం కష్టం అయింది. అనేక పట్టణాల్లో బ్రాంచిలను ఏర్పాటుచేసి ఒక పరిశ్రమగా దీనిని అభివృద్ధి చేశాడు. నూతన సంవత్సరం ప్రారంభంలోనే కాకుండా ఏడాది పొడుగునా రకరకాల సందర్భాలలో ఇవ్వడానికివీలుగా ఎన్నో గ్రీటింగ్ కార్డులు తయారయ్యాయి. అనిల్ మూల్‌చందానీ మనసు ఏ చిన్న ఆలోచన తళుక్కుమన్నా కొత్త గ్రీటింగ్ తయారైపోవలసిందే.

ప్రస్తుతం భారతదేశంలో 120 పట్టణాల్లో 450 బ్రాంచీలను ఈ ఆర్చీస్ సంస్థ ఏర్పాటు చేసుకుంది. కోట్లాది



రూపాయల టర్నోవర్‌తో వ్యాపారం సాగుతోంది. ఆరుదేశాల్లో కొత్తగా బ్రాంచీలు ఏర్పాటు అయ్యాయి. గ్రీటింగ్‌ల వ్యాపారంలో అగ్రగామిగా ఉన్న ఆర్చీస్ సంస్థ "హృదయ స్పందనల" వ్యాపార సంస్థగా ముందుకు దూసుకుపోతూనే ఉంది.

* * * *

"ప్రేమికులుగా ఉన్న మనం భార్యాభర్తలు అవుతామని అనుకోలేదు. మనసులు కలిసినా కలవని కుటుంబ సంప్రదాయాలు మనలని ఒకటి చేస్తాయని అనుకోలేదు.

నిజంగా జరిగినదంతా తలచుకుంటే కలగా అనిపిస్తోంది." స్వప్న ఆర్తిగా అంది.

అభిరామ్ ఆమె తలపైన చిన్నగా తడుతూ "జరగవలసింది జరిగింది అంతే. మనం ఒకర్నొకరు ఇష్టపడ్డాం. ఇలా మనం కలిసి జీవించడానికి అవకాశం కల్పించిన ఆర్చీస్‌కి ఎప్పుడూ కృతజ్ఞులమై ఉండాలి!" అన్నాడు.

దూరంగా సముద్రపు అలలు ఎగిరి విరిగిపడుతున్న చప్పుడు అస్పష్టంగా వినిపిస్తోంది. సాయం సమయంలో సముద్రపు గాలి హోరు శరీరాన్ని రాసుకుని దూసుకుపోతోంది. వాతావరణం ఆనందాన్ని కలిగిస్తోంది.

భర్తమాటలు స్వప్నలో రెండు నిమిషాలు చలనాన్ని కలిగించలేదు. ఆర్చీస్ పేరు వినబడగానే ఒక్కసారి ఆనందం పెల్లుబికింది.

నీకు మొదట గ్రీటింగ్‌కార్డు ఇచ్చింది, ప్రేమికుల రోజున, నీ పుట్టినరోజు అన్ని రోజుల్లోనూ నీకు ఇచ్చినవి ఆర్చీస్ గ్రీటింగ్ కార్డులే. ఆ కార్డుల్లో అక్షరాలు నీ మనసుని హిప్నటైజ్ చేశాయి అభిరామ్ చెప్పాడు.

"మన ప్రేమ నిజం అయితే ఆ ప్రేమకు వారధి కట్టిన ఆర్చీస్ గ్రీటింగ్ కార్డులు మరింత నిజం. నువ్వేంటి... నేను కూడా ఆ గ్రీటింగ్ కార్డుల సందేశాలను మరిచిపోలేను. మన మనసుల్ని కట్టిపడేసిన కార్డులు అవే. ఈ కార్డుల కన్నా మనం అనిల్ మూల్‌చందానీ ని కూడా మరచి పోకూడదు." స్వప్న అంది.

అందుకే నీకు మరో గ్రీటింగ్ కార్డు తెచ్చాను.

స్వప్న ఆతృతగా అందుకుని విప్పింది.

చిలకా గోరింక ఒకే కొమ్మపై కూర్చుని ఉండగా పక్షిపిల్ల వాటికేసి ఆశ్చర్యంగా చూస్తున్న దృశ్యం ఉంది. లోపల "ప్రేమమయం జీవితం. కలిసి ఉంటే కలదు సుఖం. సుఖ సంతోషాల సారం. సంసార సాగరం. పిల్లాపాపలతో ఉండాలి కలకాలం." ఇదే అర్థంతో ఇంగ్లీషులో ఉంది.

స్వప్న చదివి ఆనందంగా నవ్వింది. తెరలుతెరలుగా నవ్వడంతో కళ్ళల్లో నీళ్ళు ఉబికాయి.

"ఆనందబాష్పాలే కదూ?" అభిరామ్ మోహంలో మోహం పెట్టి అడిగాడు. స్వప్న మరోసారి పగలబడి నవ్వింది. ○

"పిప్పరమెంటూ = పడుచుపెళ్ళాం!!"

త్రినేత్రి

"పాత లెక్కలే... కాకపోతే కొత్త ఈక్వేషన్లలో చెబుతున్నారంతే" అన్నాను.

మా ఫ్రెండ్‌సర్కిలంతా ఒకింత వినుగ్గా...కొంత ప్రశ్నార్థకపు మొహాలతో...ఇంకొంత ఆశ్చర్యార్థక సింబల్‌గా నా వంక చూస్తున్నారు.

ఎప్పుడూ ముందు అర్థంకానట్లు మొదలెడతానని విసుగులేండి.

ఈ రెండింటికీ సంబంధం ఏంటనీ డౌట్ పడ్డారనుకోండి.

సైన్స్ సబ్జెక్టుల్లో డిగ్రీ వెలగబెట్టే నేను లెక్కల సబ్జెక్టులో మాట్లాడానని ఆశ్చర్యపోయుంటారులేండి.

కాలేజీ గ్రౌండ్‌లో సిమెంట్ బెంచీల మీద కూర్చున్న మమ్మల్ని చూసి మా సీనియర్ మగరాయుళ్ళు ఏవేవో కూస్తుంటారు కదా!

అయితే...ఆ కూతలన్నీ ఎప్పటికప్పుడు లేటెస్ట్‌గా ఉంటాయనుకోండి.

ఈ మధ్య వెరీ లేటెస్ట్ అయిటమ్ మా ముందు డిస్‌ప్లే చేస్తున్నారు.

పిప్పరమెంట్స్ రేపర్లు మాముందు విప్పి తినడం...ఆ రేపర్‌మీది బ్రాండ్ మేము చూడాలనేట్టు నానా తంటాలూ పడిపోతున్నారల్లే వుంది.

అలాంటి లేటెస్ట్ షోలు ఇటీవలే... జస్ట్ రెండుమూడు నెలల నుంచి అనుకోండి.

ముందు మాకూ అర్థం కాలేదు. కానీ ఈ మధ్య టీవీ ఛానల్స్‌లో వచ్చే యాడ్‌ను మా ముందు ప్రొజెక్ట్ చేస్తున్నారని తెలుసుకుచచ్చాం.

ఏం చేస్తాం... కొందరి వెకిలిచేష్టలకు మాకిట్లా పరిశోధనాజ్ఞానం లభించడం ఛానల్‌చరిష్మా ఫలం.

ఛానల్లకే కళ్లప్పగించే వారి కళ్ళల్లో తమ వస్తువు పాతుకుపోవాలని పడే తంటాలలో కొన్ని రకాల యాడ్‌లు రూపుదిద్దుకుంటున్నాయి.

అలా ఒక కంపెనీవాడి పిప్పరమెంట్ బిళ్ళల్నే జనమంతా నమలాలని ఒక ప్రకటనా చిత్రరాజాన్ని వదిలారు.

దాన్ని చూసిన మన కాలేజీబుల్లోళ్ళు... ఆ పిప్పరమెంటు నమిలితే...కాలేజీబుల్లెమ్మలు అప్పనంగా తమెంట పడిపోతారని "యాక్...టింగ్" చేస్తున్నారు.

ఇంతకీ ఆ కొత్త ఈక్వేషనేంటే... అని మా వెనుక బెంచి సుశీల...

ఏ పాత లెక్కలకి ఆ ఈక్వేషనూ...అని మా డొట్లమాస్టరిణీ సాజిదాబేగం...

అసలే క్లాసులో పాఠాలకే అర్థంకాని పజిల్‌పజిల్ మొహాలు పెట్టలేక చస్తుంటే నీ కామెంట్లకో పజిల్‌మొహం ఎక్కణ్నించి తేనూ అని గౌరి..

ఒకటే వాపోతున్నారు. వాళ్ళనలా ఎక్కువసేపు వాపోయేలా చేయడం ఎందుకులే అని నాకే తెగ జాలేసిందనుకోండి.

అంతటి జాలీఫేస్ పొడుం మొహాలేసుకు చావద్దే...మనల్నింకా ఆట వట్టిస్త్రారీ మగమంత్రకాయలు అనంటుంటాను పెద్ద ఆరిందలాగా...

ఏదో మా అయ్య అదేదో యూనియన్లో తిరుగుతూ...ఓ నాలుగు ముక్కలు మా ఇంట్లో కూడా చెబుతుంటాడు కదా... ఆ నాలుగు ముక్కలనూ నేను ఇక్కడ ఊదుతుంటే మనకా ఆరిందా సీనొచ్చిందిలేండి!

ఇంతకీ ఆ పాతచింతకాయ లెక్కేంటంటే... ఆడదంటే ఆటబొమ్మ... ఆడేబొమ్మ...ఆడించుకునే బొమ్మ అని. ఇది తరతరాల సామాజిక లెక్క. ఆరునూరయినా మన ఇంటావంటా...ఇంటి చుట్టూ ఉన్న దేశంలో, లోకంలో ఇదే లెక్క కొనసాగితీరాల్సిందేనని మనువంతటోడు రాసి పడేశాడు కదా! ఆ మనువు ఒకడుకాదు... ఇద్దరో ముగ్గురో కాదు... అదొక వ్యవస్థని కూడా చాలా మందికి అర్థంకాలేదు. మాబోటివారికింకేం అర్థమవుతుంది చెప్పండి.

మరి కొత్త ఈక్వేషన్ ఏటంటే... అర్ధరూపాయి పిప్పరమెంట్ బిళ్ళను రావులపాలెం నుంచొచ్చిన జుట్టుపోలి మగోడు నమిలే వాసనకే ఓ ముసలివాడి పడుచుపెళ్ళాం వాడి సైకిల్ వాహనంపై లేచిపోతుంది ర!!!

అలాగని...అలా జరుగుతుందనేసి... సదరు పిప్పరమెంట్ బిళ్ళలమ్ముకునే కంపెనీవోడు యాడ్‌ఫిల్మ్ తీసి పడేశాడు.

అది చూసిన మా కాలేజబ్బాయి మూకకు అదొక కొత్త ఆట అయిపోయింది. ఆ వ్యాపారప్రకటన చూసి ఆ పిప్పరమెంట్ కొనుక్కొని దాని అమ్మకాలు పెంచడమే కాదు. దానితో పాటు "పిప్పరమెంట్ ఈజీక్వల్టూ పడుచుపిల్ల" అనే దరిద్రపుగొట్టు ఆలోచనను కూడా అంటించుకున్నారు.

మరందుకే మగవారి సైట్‌కొట్టుడులకు అదనపు ఎఫెక్ట్ పిప్పరమెంటోప్లస్సు.

దీనికి తాత్కాలిక విరుగుడు కచ్చితంగా కంట్లో డబల్‌పవర్డ్ కారప్పొడో ప్లస్సే!!

రొండు తల్కాయల పాము

కాలువమల్లయ్య

గ్లోబలైజేషనంటేందనుకున్నరు...? గ్లోబునంత ఒక్కటి జేసుడు... గిదీనితోని ఎంతోమందికి లాభమయితది. సమానత్వం పెరుగుతది. ఎవ్వరేపనయిన చేసుకోవచ్చు. ప్రతిభను బట్టి ఫలితాలుంటాయి. కొందరు గిదీన్ని వద్దంటున్నరు. ఇది ఏం నష్టం సేత్తుందని బాధపడటం?! దీంతోని కులాలు పోతయి. కులబేధాలు, మతభేదాలు లేకుంటయితయి. తీవ్రవాదం దానికదే మటుమాయమై పోతది. ఇది బలహీనవర్గాలోల్లకు ఇంకింత ఉపయోగపడ్తది. దీన్ని విమర్శించెటోల్లు గీ సంగతులన్నెందుకాలోచించరు...? గౌండ్లోల్లు తాళ్ళెక్కుకుంటనే బతుకాల్నా...? గొల్లోల్లు గొర్లుకాసుకుంటనే బతకాల్నా... సాలోల్లు మొగ్గం గుంటల్నే ఉండిపోవాల్నా... కాపోల్లు ఎద్దుముడ్డి పొడుసుకుంట, బెస్తోల్లు చేపలు పట్టుకుంటనే



ఉండల్నంటెట్ల.

ఇవ్వన్నీట్ని మాయంజేత్తది ప్రపంచీకరణం...? ఎవ్వలు ఏ పనయిన చేసుకోవచ్చంటది. వృత్తిపనులల్ల ఏం పాడయింది...? ఇప్పుడన్ని యంత్రాలేనాయే. ఊళ్ళె వృత్తిపనులుండాలని కోరుకునెటోల్లు అభివృద్ధి నిరోధకులు. అటువంటోల్లే ప్రపంచీకరణను వ్యతిరేకించుతున్నరు. మనం ఎట్టి పరిస్థితిలగూడ దీన్ని వ్యతిరేకించచద్దు. దీన్ని వ్యతిరేకించుడంటె ఏటికెదురీదుడన్నట్టే."

చెప్పుకపోతున్నడు సారు. అందరింటున్నరని రెచ్చిపోయి మరీ చెప్పుతున్నడు. గా సారుపేరు రణధీర్. తను చాలా తెలివికలోన్ననుకుంటడు. తను చెప్పిందే అందరు వినాలంటడు. తాను వినేదేం లేదనుకుంటడు. తాను పుట్టిందే చెప్పటానికని బాగ నమ్ముతడు. అట్లని అయనె బాగ ధనవంతుల కుటుంబంల, ఉపదేశాలిచ్చే కులంలేం పుట్టలేదు. పనిపాటలోల్ల కులంలనే పుట్టిండు. కష్టపడే చదువుకున్నడు. ఇప్పుడు తెల్లబట్టల మనిషయిండు. మంచిగనే సంపాయించాడు. ఇంకేందిగ... తనే మాదండి మనిషిననుకుంటండు. ఉపదేశాలిచ్చుడే తన పనని ఎక్కడ దొరికితక్కన్నే చెప్పుతనే ఉంటడు. గట్లనే ఇప్పుడుగూడ జెప్పుతుండు. వినెటోల్లంత బజారుగాల్లనుకుంటండేమొ... చెప్పుతనే ఉన్నడు. అదెంతకు ఒడిసెటట్టులేదు. ఇంతల్నే రాజమల్లచ్చిండక్కడికి తన సోపతికాడు వెంకటేశ్వర్ల దిక్కు చూసిండు.

"సారూ...! ఓసారూ...!" అన్నడు వెంకటేశ్వర్లు. గప్పుడాగిండు రణధీర్‌సారు...

"సారని కాలడ్డమాడవడ్తివేంది. వెంకటేశ్వర్లు...?" అన్నడు.

''మీరు మాదండి మేధావులుగద...! సారనకుంటెట్ల...?"

"అంటె మానాయెగని ఏందో చెప్పు...!"

వెంకటేశ్వర్లు పక్కనే ఉన్న రాజమల్లును చూసి గజ్జుమంది రణధీర్‌కు. నువ్వద్ది మాట్లాడెటోల్లంటె నరికెటోల్లకు భయమే కద...

"మీరేదో చెప్పు తండ్రుగద.. గ దాన్ని గురించే..."

"నేనన్నదాంట్లేమన్న తప్పుందా?"

"గిప్పుడు తప్పొప్పుల సంగతెందుకు కని మీకు గా గ్లోబల్ ముద్దు గంత తియ్యగనివిన్నందా సారు...! గండ్లున్న తీపి చెక్కరబీదూరి తీపని మీకు తెలువదా..." అన్నడు వెంకటేశ్వర్లు...

"నువ్వనేదేంది...?" అన్నడు కొంచెమంత కోపంగ రణధీర్.

"శ్రమజీవుల కులంల పుట్టి నౌకరి జేసుకుంట ఇంతంత సంపాయించుకున్ననని గిట్ల మాట్లాడుతెట్ల సారు...? మీకు గీ ప్రపంచీకరణంల అంత తీపెందుకు కనవడ్తంది...?"

"నేనన్న దాంట్లేం తప్పుంది...?"

ఇగ గప్పుడు దొరుకవట్టిండు రాజమల్లు.

"మీరు బాగ తెలివికలోల్లుగద...! ప్రపంచాన్ని సూత్తె తెలుత్తలేదా... సరెగని నేను కొన్ని ప్రశ్నలడుగుత జవాబులు చెప్పుతవా..." అన్నడు...

"సరే... అడుగు గవ్వేందో..."

"మీరు దీన్ని మా దండిగ పొగుడుతున్నరు గద...! దేనిదేనితోనో పోలుస్తున్నరు గద... ఇదేమన్న బుద్ధుడు చెప్పిన బహుజన హితవులాంటిదా..."

"కాదు కాదు..."

''ప్రపంచమంత ఒక్కటంటున్నరుగద...! మార్క్సుచెప్పిన ప్రపంచకార్మికులారా ఒక్కటి కండి లాంటిదా..."

అనుమానంల పడ్డడు మేధావి.

"కాదు కాదు..." అన్నడు...

''మరిండ్లేముంది... ప్రపంచంల ఎంత వైవిధ్యముంది... ఎన్ని నాగరికతలు...? ఎన్ని జాతులు...? ఎన్ని సంస్కృతులు...? ఇవన్ని పోయి మన సంస్కృతే ప్రపంచమంత ఏలాలన్నంటే మన్నట్టు...? ప్రపంచీకరణంటె పాశ్చాత్తీకరణ కదా...! బలమున్నోడిదే రాజ్యం, దుడ్డున్నోడిదే బర్రె అన్నట్టే కదా ఇది...! మార్క్సు, బుద్ధుడు చెప్పిన విషయాల్లో ఎంత మానవత్వముంది... మరి గిదీంట్ల ఉన్నదేంది? ఆధిపత్యమే కదా...! బలవంతులు దుర్బలజాతిని బానిసలను గావించే దుర్మార్గం ఇందులో లేదా...? మరి దీంట్ల ఏదో ఉన్నదని చెప్పవడ్తివి. ఇందులోని కటికచేదు నీకు తియ్యగెందుకు కనవడ్తందో నాకు తెలుస్తలేదు. గిదోంతోని బహుజనుల బతుకులన్ని పాడయిపాయె... ఆ వర్గం నుంచే వచ్చిన మీరేమొ అండ్లమస్తు లాభముందని నరుకవడ్తిరి.. గిట్లుంటదా సారు..."

రాజమల్లు మాటలకు పరేషానయిండు రణధీర్...

"వృత్తులనే పట్టుకోని వేలాడుతె వచ్చేదేంది...?" అన్నడు.

"వాట్నే పట్టుకొని వేలాడుమని ఎవ్వలన్నరు...? వేలాడుటానికి అవ్వి ఉన్నయెక్కడ...? బతుకటానికి ఏదో పనిజేసుకుంటె వృత్తులను పట్టుకొని వేలాడినట్టా...? పనిపాటలోల్ల బలమంత గీ వృత్తి పనులల్లనే ఉందని అందరికెరికే గద...!

గీ ప్రపంచీకరణ ఎవ్వలకేం జేసిందో చెప్పుండ్రి...!

చాలామంది ప్రపంచవ్యాప్తంగ ఉన్న కొంచెమంత వృత్తిపనుల అవకాశాలను కోల్పోయి రోడ్డుకెక్కిరి. విపరీతంగ మానవ వనరులున్న మనదేశంల పనులు లేకుంట జేత్తె వీళ్ళంతెట్ల బతుకాలె...!

ఆవుపేడను తాకనోడు పాలవ్యాపారంల కోట్లు సంపాయించుతంటె, అసలోల్లు తిండికి లేక మాడి పోవట్టిరి. ఉంగుటమంటె తెలువనోడు తెల్లబట్ట లేసుకొని చెప్పుల దుకాండ్ల కూసుండుడేనా ప్రపంచీకరణమంటె...? నాగలి సాలంటెనే ఎరుకలేనోడు కార్పొరేట్ ఎవుసం పేరుమీద భూములన్ని సొంతం జేసుకుంటె రైతులంత అండ్ల పనిజేసుడే ప్రపంచీకరణా. గిట్ల అందరి వృత్తి పనులు పోయి సంక్షోభంల కొట్టుకసత్తాంటె అదేదో శాస్త్రం జెప్పినట్టు మంచిజేసిందని చెప్పవడ్తిరేంది... వానకాలంల చెర్వులెండిపోతున్నయి. అన్ని కాలాలు మాయమై ఒక్క ఎండకాలమే మిగుల్తంది. గివ్వన్ని సుఖవాంఛను పెంచుడుతోని జరిగేటివే కద...! మీరన్న ప్రపంచీకరణ ఫలితమే కద... సానమంది ప్రత్యామ్నాయాలు లేక కొట్టుకసత్తుంటె మీరేమో గిట్లనవడ్తరి. గిండ్ల అమానవీయత కనవడ్తలేదా సారు...? రొండు తలుకాయల పాముకు ముద్దెటో మూతెటో తెలువనట్టున్నయి సారు మీ మాటలు..."

అన్నడు రాజమల్లు.

నోరు మూసుకోని ఎల్లిపెయిండు ఆ కుహనా మేధావి. ○

దంత వ్యాధులు - ముందు జాగ్రత్తలు

డా॥ ఎ.జె. సాయి శంకర్

నేడు ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది ప్రజలు వివిధ నోటి సంబంధ వ్యాధులతో బాధపడుతున్నారు. నిజానికి నూటికి 99 నోటి సంబంధ వ్యాధులు పూర్తిగా నిరోధించగలిగినవే. అయినా ప్రపంచ ప్రజలు నూటికి 90 మంది ఏదో ఒక విధమైన నోటి, దంత సంబంధ వ్యాధితో బాధపడుతుండడం విచారాన్ని కలిగిస్తోంది.

ఆ వ్యాధులపై సరియైన అవగాహన లేక ప్రజానీకం ఆ వ్యాధుల్ని గురించి అంతగా పట్టించుకోవడం లేదు. మౌనంగా దంత బాధల్ని అనుభవించడం అలవాటు చేసుకున్నారనడం సత్యదూరం కాదేమో. ఆ వ్యాధుల కాంప్లికేషన్‌లు మాత్రం మనుషుల్ని మృత్యుద్వారం దాకా తీసుకెళుతూనే వున్నాయి. అయితే ఆ మృత్యు ద్వార మార్గానికి మూలం నోరే అని చాలా మందికి తెలియదనడంలో అనలేమాత్రం నందేహం అక్కరలేదు. వైద్యులు సైతం నోటి, దంత సంబంధ వ్యాధుల విషయంలో రోగి ప్రత్యక్షంగా ఏదైనా నోటి సంబంధ బాధను చెపితేగాని ప్రాధాన్యతను యివ్వడం లేదు. మన రాష్ట్రంలోనే జరిపిన ఒక అధ్యయనం ప్రకారం 92 శాతం మంది అసలు నోరు, దంతాల విషయంలో ఏమాత్రం శ్రద్ధ చూపడంలేదు. ఇతర రాష్ట్రాలలో, దేశాలలో పరిస్థితి కూడా యింతకంటే భిన్నంగా ఏమీలేదు. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ గతంలో ఒక సంవత్సరం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఓరల్ హెల్త్ ఫర్ ఎ హెల్దీలైఫ్ అనే నినాదాన్ని యిచ్చింది. దంత వ్యాధుల అధ్యయన శాస్త్రమైన డెంటిస్ట్రీ దినదినాభివృద్ధి చెంది తొమ్మిది విభాగాలుగా విడిపోయి ప్రజలకు అత్యంత చేరువయింది. దంత నోటి వ్యాధుల నివారణలో, నిర్మూలనలో అత్యాధునికతను చూపిస్తోంది. వివిధ డెంటిస్ట్రీ విభాగాలను, సాధారణ నోటి దంత సంబంధ వ్యాధుల గురించి తెలుసుకుందాం.

అసలు డెంటిస్ట్రీ అంటే ఏమిటి? దీని పుట్టుపూర్వోత్తరాలు ఏమిటి?

స్థూలంగా దంత సంబంధ వ్యాధుల అధ్యయన శాస్త్రాన్నే డెంటిస్ట్రీ అంటారు. మొదటి నుంచి ఇదొక ప్రత్యేక విభాగంగానే వున్నా, ఈ మధ్యకాలంలో వైద్య రంగంలో సాధించిన అభివృద్ధి ప్రభావం డెంటిస్ట్రీలో తొమ్మిది ఉప విభాగాలు పుట్టుకొచ్చాయి. ఈ విభాగాలన్నీ దినదినాభివృద్ధి చెందుతూ ప్రజలకు మరింత సేవల్ని అందిస్తున్నాయి.

అసలు పంటి నిర్మాణమేమిటి? మానవునిలో గల వివిధ రకాల దంతాలేమిటి?

పంటి నిర్మాణం విషయానికి వస్తే ప్రతి పంటిలో



ఎనామిల్, డెంటిన్, పల్ప్ అనే మూడు పొరలుంటాయి. మానవునిలో నాలుగు రకాల పళ్ళుంటాయి. వీటినే ఇన్‌సిజార్స్, కానైన్, ప్రిమోలార్స్, మోలార్స్ అని వ్యవహరిస్తుంటారు. పిల్లల్లో మొదటిగా వచ్చే దంతాలను పాలదంతాలు (మిల్క్ టీత్) అంటారు. తర్వాత ఇవి ఊడిపోయి వీటి స్థానంలో శాశ్వత దంతాలు వస్తాయి. యుక్త వయస్కులలో మొత్తం 32 దంతాలుంటాయి.

సాధారణ దంత సంబంధ వ్యాధులేమిటి? వాటికి కారణాలేమిటి?

పిప్పిపళ్ళు, డెంటల్ ఫ్లోరోసిస్, పళ్ళ వరస సరిగా లేకపోవడం, పళ్లకు ఏ కారణం చేతనైనా దెబ్బ తగిలినప్పుడు విరిగిపోవడం మొదలయినవి పేర్కనదగినవి. వీటికి ప్రధానకారణం ప్రజలు దంతాల విషయంలో సరైన శ్రద్ధ కనబరచకపోవడమే. ఇంకా ధూమపానం, మద్యపానం, వక్క కిళ్ళీలు నమలడం వంటి దుర్వ్యసనాలు, కొన్ని రకాల మందులు - ఐరన్ టాబ్‌లెట్స్, టెట్రాసైక్లిన్ క్యాప్యూల్స్, యాక్సిడెంట్లు వంటి వ్యాధులకు కారణమవుతున్నాయి. త్రాగే నీటిలో ఫ్లోరిన్ అధిక శాతంలో వుండడం వల్ల డెంటల్ ఫ్లోరోసిస్ వస్తుంది.

సాధారణ పంటి చిగుళ్ళ వ్యాధులేమిటి? వాటికి కారణాలేమిటి?

చిగుళ్ళు పంటికి పునాదుల వంటివి. పంటి చిగుళ్ళ ఆరోగ్యం మీదే దంత దృఢత్వం ఆధారపడి వుంటుంది. పంటి చిగుళ్ళ వ్యాధులలో పయేరియా, స్కర్వీ, చిగుళ్ళ వెంట చీము, రక్తం కారడం మొదలయినవి పేర్కొనదగినవి. వీటికి కూడా దంత వ్యాధులకు కారణమవుతున్నవే కారణమవుతున్నవి. ల్యుకేమియా (రక్తక్యాన్సర్), కొన్ని రకాల రక్తస్రావ సంబంధ వ్యాధులు కూడా పంటి చిగుళ్ళ వెంట రక్తం కారడానికి కారణమవుతాయి.

పాల పళ్ళ ప్రాముఖ్యత ఏమిటి?

పిల్లలో మొదటగా వచ్చే దంతాలనే పాలపళ్ళు అంటారు. ఇవి బిడ్డ పుట్టిన ఆరునెలల తర్వాత రావడం ప్రారంభిస్తాయి. పిల్లలకు మూడేళ్ళు వచ్చేసరికి పాలపళ్లు అన్నీ వచ్చేస్తాయి. ఇవి 20 వుంటాయి. అయితే పిల్లల శరీర తత్వాన్ని బట్టి కొందరికి కొంచెం తొందరగాను, మరికొందరికి కొంచెం ఆలస్యంగాను పాల పళ్ళు రావచ్చు. పాలపళ్ళు ఊడిపోయి శాశ్వత పళ్ళు వస్తాయి కదా అని వీటిని నిర్లక్ష్యం చేయకూడదు. ఎందుకంటే పాలపళ్ళు వాటి స్థానంలో వచ్చే శాశ్వత పళ్ళకు దారి చూపిస్తాయి. పాలపళ్ళను అశ్రద్ధ చేస్తే దాని ప్రభావం శాశ్వత పళ్లపై ఎంతగానో వుంటుంది. సరిగా మాటలు రావడానికి, ఆహారం నమలడానికి, చక్కని చిరునవ్వుకు, శాశ్వత పళ్ళు సరైన వరుసలో రావడానికి, దవడల ఎముకలు సరైన పెరుగుదలకు, పిల్లల మానసిన పెరుగుదలకు ఆరోగ్యవంతమైన పాలపళ్ళు ఎంతైనా అవసరం అనే విషయం గుర్తుంచుకోవాలి.

పళ్ళు వంకర టింకరగాను, ఎత్తుగాను, వరుసక్రమంలో రాకపోవడానికి కారణాలేమిటి? వీటిని ఎలా నిరోధించవచ్చు?

పళ్ళు వంకర టింకరగాను, ఎత్తుగాను ఉండటానికి పిల్లలు చిన్నతనంలో నోటిలో వేళ్ళు పెట్టుకోవటం, పెదిమ కొరకటం, నోటితో గాలి పీల్చటం మొదలైనవి కారణములుగా పేర్కొన వచ్చును. ఇంకా కొందరిలో వంశపారం పర్యంగా పెద్దల ద్వారా, మరికొందరిలో పాలపళ్ళు ఉండవలసిన సమయం కన్నా ముందుగా పిప్పి పళ్ళయి ఊడిపోవటం వల్ల, ఆ ఖాళీ ప్రవేశం మూసుకుపోయి వంకర పళ్ళు వస్తాయి. ఈ వంకర పళ్ళ మూలంగా పళ్ళను సరిగా శుభ్రపరచుటకు వీలుపడదు. కనుక పిప్పిపళ్ళు, చిగుళ్ళ వ్యాధులు

పళ్ళెలా పాడవుతాయి?

ఆహారం తీసుకున్నాక పళ్ళను శుభ్రపరచుకోవాలి. ఆహారం తీసుకున్న ప్రతిసారీ ఆ పనిచెయ్యం. ఇక పిల్లల విషయం అయితే చెప్పనక్కర్లేదు. చాక్లెట్లు, స్వీట్స్, ఐస్‌క్రీమ్‌ల వంటి వివిధ మెత్తని పదార్థాలను ఎప్పుడు బడితే అప్పుడు తీసుకుంటుంటారు. ఈ ఆహారపదార్థాల అవశేషాలే పళ్ళ మధ్యన ఇరుక్కుపోతాయి. తర్వాత ఇవి బ్యాక్టీరియా వంటి సూక్ష్మజీవుల రసాయన చర్యలకు గురవుతాయి. ఫలితంగా లాక్టిక్ యాసిడ్ వంటి ఆమ్లాలు తయారవుతాయి. ఈ ఆమ్లాలు దంతక్షయానికి దారితీస్తాయి. పంటిపైన వుండే ఎనామిల్ మొదటగా రసాయనచర్యకు గురై కరుగుతుంది. ఫలితంగా పంటిలో ఆ ప్రాంతంలో గుంట ఏర్పడుతుంది. దాన్నే మనం పిప్పిపన్ను అంటాం. ఈ గుంటలో, ఆహారం తీసుకున్నప్పుడల్లా యిరుక్కుపోతూ ఉంటుంది. కారణంగా గుంట లోపలి పొరలకు విస్తరించుకుపోతుంది. చివరకు పల్ప్‌ను చేరి రక్తనాళాలతో సంబంధం ఏర్పడుతుంది. అందువల్ల బ్యాక్టీరియా రక్తనాళాలకు చేరి శరీరమంతా ప్రవహించి అనేక కాంప్లికేషన్‌లకు దారితీస్తుంది. కనుక పిప్పి పళ్లను, పళ్లపై నల్లని మచ్చలను ఏ మాత్రం అశ్రద్ధ చేయకూడదు.

డెంటల్ ఇంప్లాట్స్ అంటే

సాధారణంగా శాశ్వత దంతాలను, ఇరు పక్కల పళ్ళు బాగా వున్నప్పుడే అమర్చడం జరుగుతుంది. అయితే ఇక్కడ ఇరు పక్కల, పళ్ళతో సంబంధంలేకుండా, పన్ను ఊడిపోయిన చోట వున్న ఎముక ఆధారంగా పళ్ళను కడతారు. ఇలా కట్టిన పళ్ళనే డెంటల్ ఇంప్లాట్స్ అంటారు. వీటిలో టైటానియంతో తయారుచేసిన డెంటల్ రాడ్స్‌ను ఎముకలో అమర్చి వాటి ఆధారంగా దంతాలు నిర్మిస్తారు. కనుక ఇవి మామూలు పళ్ళలానే పనిచేస్తాయి. ఈ డెంటల్ ఇంప్లాట్స్ అందరికీ అమర్చలేము. సరైన అంటే అరగని దవడ ఎముక గల వారికి మాత్రమే డెంటల్ ఇంప్లాట్స్ అమర్చే అవకాశం వుంటుంది.

వీరిలో ఎక్కువగా వస్తాయి. ఈ వంకర, ఎత్తు పళ్ళను కొన్ని రకాల పళ్ళ క్లిప్పులను అమర్చడం ద్వారా, శస్త్రచికిత్స ద్వారా సరిచేసే వీలున్నది.

ఓరల్ సర్జరీ గురించి స్థూలంగా తెలియజేస్తారా?

ఓరల్ సర్జరీ నేడు ప్రత్యేక ఉపవిభాగం డెంటిస్ట్రీలో విశేష సేవలను అందిస్తున్నది. ముఖానికి సంబంధించిన అనేక శస్త్ర చికిత్సలలో ఓరల్ సర్జరీ విస్తరించింది. మాండిబ్యులార్ సర్జరీలు, డెంటల్ ఏబొసిస్‌లు వంటి మైనర్ శస్త్ర చికిత్సలతో పాటు మాగ్జిల్లరీ బోన్ ప్రాక్చర్స్, ఆర్బిటల్ బోన్ ఫ్రాక్చర్, నేసల్ బోన్ ఫ్రాక్చర్స్, మాండిబ్యులార్ ఫ్రాక్చర్స్ ఆయా ఫ్రాక్చర్స్‌తో వైరింగ్, ప్లేటింగ్ వంటివి అమర్చడం ద్వారా సరిచేయడం జరుగుతున్నది. అంతేకాక, క్రింద దవడ ముందుకు పొడుచుకు వచ్చిన వారిలో శస్త్రచికిత్సల ద్వారా నేడు సరిచేసే వీలున్నది. అలాగే వెనక్కుపోయిన వారిలో ముందుకు జరిపే వీలుకూడా వున్నది. అదే విధంగా పైదవడ అయిన మాగ్జిల్లాను కూడా సరిచేయవచ్చును. ఓరల్ క్యాన్సర్‌కు కూడా



శస్త్ర చికిత్స చేయడం జరుగుతున్నది. ఇలా కాస్మోటిక్ సర్జరీలు నిర్వహించి దవడలను సరిచేయవచ్చును.

కృత్రిమ పళ్ళు లేదా కట్టుడుపళ్ళ అవసరం ఎందుకు వస్తుంది. వీటిని దేనితో తయారుచేస్తారు? వీటిలో రకాలేమిటి?

ఏదైనా పంటి వ్యాధుల వల్లగాని, యాక్సిడెంట్ల వల్లగాని, పుట్టుకతోనే పళ్ళు రాకపోయినందువల్లగాని, వయసు మీరిన వారిలో పళ్లు ఊడిపోవటం వల్లగాని, ఇలా ఏ కారణం చేతనైనా పళ్ళు ఊడిపోతే... వారికి కట్టుడు పళ్ళ అవసరం వస్తుంది. ఈ కట్టుడు పళ్ళను సాధారణంగా యాక్‌లిక్ ప్లాస్టిక్, బోస్లిన్ పింగాణి వంటి పదార్థాలతో తయారుచేస్తారు. వీటికి పైన గోల్డ్, నికెల్ క్రోమ్, క్రోమ్, కోబాల్ట్ వంటివి పూతగా వాడతారు. కృత్రిమ పళ్ళలో రెండు రకాలున్నాయి. రోజూ తీసి పెట్టుకునే కృత్రిమ పళ్ళు, శాశ్వతంగా ఉండేటట్లు అమర్చే పళ్ళు.

పళ్ళన్నీ ఊడిపోయిన వారికి ఎలాంటి పళ్ళు అమర్చుతారు?

పళ్ళన్నీ పూర్తిగా ఊడిపోయిన వారికి మొత్తం కృత్రిమ పళ్ళ సెట్టును తయారుచేసి అమర్చడం జరుగుతుంది. వీటిని కూడా చిగుళ్ళ ఆధారంగానే కడతారు. వీటివల్ల ఓరల్ క్వాలిటీ స్పేస్ మెయిన్‌టైన్ చేయబడుతుంది. బాహ్యంగా పళ్ళన్నీ ఉన్నట్లుగానే కనబడతాయి. ఆహారం తీసుకోవడంలో కొంతవరకు దోహదపడతాయి. పళ్ళన్నీ ఊడిపోయిన వారికి మామూలు పద్ధతిలో శాశ్వత దంతాలు అమర్చడం సాధ్యం కాదు.

పళ్ళు ముఖ్యంగా పై పళ్ళు పీకించుకుంటే కళ్ళు దెబ్బతింటాయి అంటుంటారు. నిజమేనా?

ఇది కేవలం అపోహ మాత్రమే, పళ్ళకు, కళ్ళకు ప్రత్యక్షంగా ఎలాంటి సంబంధం లేదు.

కంజర్‌లేటివ్ డెంటిస్ట్రీ గురించి తెలియజేస్తారా. రంధ్రాలను పూడ్చడానికి వాడే వివిధ రకాల పదార్థాలేమిటి?

పుచ్చిపోతున్న పన్ను ఇంకా పుచ్చి పోకుండా, పీకేయకుండా, వివిధ రకాల చికిత్సల ద్వారా ఆ పళ్లను కాపాడటాన్నే కంజర్‌లేటివ్ డెంటిస్ట్రీగా పేర్కొనవచ్చును. ఇందులో ముఖ్యంగా పళ్ళకు పట్టిన గారను తొలగించడం, పంటి రంధ్రాలను రసాయనాలతో పూడ్చడం జరుగుతుంది. ఈ రసాయనాలలో సిల్వర్ ఆమ్లం, కాపోజిడ్, రిస్టోరేషన్స్, గ్లాసైనోమా వంటివి వాడుతుంటారు. వీటిపై మరిన్ని ప్రయోగాలు జరుగుతున్నాయి. మున్ముందు మరిన్ని రసాయన పదార్థాలు అందుబాటులోకి వచ్చే అవకాశాలు వున్నాయి.

రూట్ కెనాల్ ట్రీట్‌మెంట్ అంటే ఏమిటి?

పన్ను రూట్ వేరులో నరం వరకు వచ్చినప్పుడు ఆ ప్రాంతాన్ని శుభ్రపరచి ప్రత్యేక పదార్థాలతో ఫిల్‌చేసి పంటిని కాపాడటాన్నే రూట్ కెనాల్ ట్రీట్‌మెంట్ అంటారు. ✪

మేడిపండు 'ప్రజాస్వామ్యం'

ప్రపంచదేశాల్లో అతి పెద్ద ప్రజా స్వామ్యంగా కీర్తింవబడుతున్న భారతీయ ప్రజా స్వామ్యపు విలువల్ని సమీక్షించిన పుస్తకం జావీద్‌ఆలం గారి 'ప్రజాస్వామ్యం కోరుతున్నదెవరు?" పుస్తకం.

ఈ పుస్తకంలో రచయిత 'ప్రజాస్వామ్యం - ప్రజలు', 'ప్రజాస్వామ్యం - బలహీన వర్గాలు', పీడిత కులాలు, ముస్లింల విశిష్టత, పౌరసత్వంపై ప్రభావం, ఉన్నత వర్గాలు - పౌరసమాజం వంటి భిన్న అంశాలను ప్రజాదృక్పథంతో విశ్లేషించారు. మెజార్టీ ప్రజల ఆమోదం మేరకే అధికారంలోకి రాగలుగుతున్న పాలక వర్గాలు, అధికారాన్ని చేపట్టిన తదనంతరం ఏ వర్గాల ప్రజల కోసం పనిచేస్తున్నారో సామాన్యునికి అవగతమయ్యేలా చేసిన ప్రయత్నం ఇది. బహుళపార్టీ వ్యవస్థలో మెజార్టీ ప్రజల అభీష్టం మేరకే అధికారాన్ని చేపడుతున్న అధికార పక్షం ఏఏ వర్గాల ఓట్లతో అందలం ఎక్కుతున్నారు? వారి అధికారసేవలు ఏ వర్గాల ఉన్నతికి దోహదపడుతున్నాయో విప్పి చెప్పే ప్రయత్నం సర్వత్రా హర్షణీయం. ఎందుకంటే ప్రపంచీకరణ నేపథ్యంలో నేటి మన రాజకీయ వ్యవస్థలో వున్న రాజకీయ పార్టీలన్నీ జెండాలు వేరయినా ఒకే ఎజెండా తో పని చేస్తున్న వైనం మన ముందు వుంది. ఈ రాజకీయ పరిస్థితుల్లో ప్రజాస్వామ్యపు ప్రస్థానం ఏ దిశకో అన్న శేష ప్రశ్నకు సమగ్ర సమాధానం జావీద్‌ఆలం గారి 'ప్రజాస్వామ్యం కోరుతున్నదెవరు?'అన్న పుస్తకం.

1990వ దశకంలో ప్రజాస్వామ్యం మనుగడపై అనుమానాలు రేకెత్తాయి. ఇక్కడ అంతర్లీనంగా పాఠకునికి ఓ విషయం స్పష్టమౌతుంది. ప్రజాస్వామ్య ఎన్నికల్లో పెరిగిన ప్రజాప్రమేయం ఏ వర్గ ప్రజల నుంచి అన్నదే. ఆ కారణంగాక ఈ ప్రశ్నకు తెర తీయాల్సిన పరిస్థితి కలిగిందన్నదే అసలు విషయం. అసలు ప్రజాస్వామ్యాన్ని, ఎన్నికల ప్రక్రియను కోరుకున్నదీ ఆశించినదీ, ఆచరించినదీ వివిధ వర్గాల కిందిస్థాయి ప్రజలే అన్న విషయాన్ని ఈ పుస్తకం వ్యక్తం చేసిన కీలక అంశం.

ప్రజల ఆకాంక్షలను భ్రమలుగా తేటతెల్లం చేసిన పరిస్థితులే పీడిత ప్రజల స్వతంత్ర పోరాటాలకు బీజాలు వేస్తాయన్న విశ్లేషణ పాఠకుల్ని ఆలోచింపజేసేదిగా వుంది.

ఈ క్రమంలోనే పీడితకులాలు స్వతంత్ర వ్యక్తిత్వాన్ని సంతరించుకుంటారని రచయిత సోదాహరణంగా చేసిన వివరణ బావుంది. ఉత్పత్తి ప్రక్రియలో నేరుగా పాలుపంచుకునే శ్రామిక వర్గాలు, ఆర్థికంగా, మతాచారాల పరంగా అస్వతంత్రులే అన్న వ్యక్తీకరణ, ఎన్నో భావాలకు పునాదుల్ని వేసేదిలా వుంది. పీడిత వర్గాలు ఆత్మగౌరవం కోసం చేపడుతున్న ఆందోళనలకు ప్రధాన భూమిక ఈ వ్యక్తీకరణలోనే నిబిడీకృతంగా గోచరిస్తుంది.

ఇలా వలు అంశాలను ప్రజాస్వామ్య నేపథ్యంలో విశ్లేషించి అణగారిన వర్గాలు ప్రజాస్వామ్య వ్యవస్థలో బలమైన శక్తులుగా ఎదగడంలోనే రాజకీయ పక్షాల స్థితిగతులపై ప్రత్యక్ష ప్రభావం వుంటుందని పేర్కొనడం ముదావహం. ఈ ప్రాతిపదికన రాజకీయ పార్టీలన్నీ నేడు అమలవుతున్న ప్రజాస్వామ్య అమలు తీరును ఆత్మవిమర్శ చేసుకుని, లక్ష్యాలను నిర్దేశించుకోవలసిన అవసరాన్ని రచయిత సూటిగా చెప్పారు.

ఏమైనా సరైన సమయంలో ప్రజాస్వామ్యాన్ని పలు కోణాల్లో విశ్లేషినా ఈ పుస్తకాన్ని తీసుకురావడం ముదావహం. ప్రచురణకర్తలు, రచయిత అభినందనీయులు.

-మురహరి

ప్రజాస్వామ్యం కోరుతున్న దెవరు

రచయిత: జావీద్ ఆలం

ప్రచురణ: ప్రజాశక్తి బుక్‌హౌస్

హైదరాబాద్-20.

పేజీలు:106, వెల:రూ. 50/-

స్వీకారం



రచయిత: పుచ్చలపల్లి సుందరయ్య

వెల: రూ. 20/-

సమైక్యాంధ్ర కోసం జరిగిన పోరాటంలో ప్రధాన పాత్ర వహించిన కమ్యూనిస్టు పార్టీ అగ్రనాయకులు, 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' రచయిత పుచ్చలపల్లి సుందరయ్య అన్ని ప్రాంతాల స్థితిగతులను, ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని, అందుబాటులో ఉన్న జలాలను అంచనా వేసి రాష్ట్రమంతటికీ ఒక సమగ్రమైన నీటి పథకాన్ని కూడా ప్రతిపాదించారు. ఇరవైఏళ్ళనాటి అప్పటి వివరాలకు, ఇప్పటి వివరాలకు కొంత తేడా వుండవచ్చు. కాని ఆ అధ్యయనంలో అనుసరించిన శాస్త్రీయ పద్ధతి, సమగ్ర దృష్టి, తీసుకున్న ప్రాతిపదికల ప్రాధాన్యత నేటికీ చెక్కు చెదరనిది.

***

పండుగలు కొన్ని ప్రజల విశ్వాసాలతోను, మరికొన్ని ఉత్పత్తితోను ముడిపడి ఆవిర్భవించాయి. పలు పండుగలను ప్రజలు సామూహికంగా జరుపుకుంటారు. ఈ సమయంలో వారి విశ్వాసాలను గౌరవిస్తూ, మత ఛాందసత్వం పెరగని రీతిలో ప్రతి లౌకికవాది ఎలా వ్యవహరించాలో వివరించేది ఈ పుస్తకం.

ఈ రెండు పుస్తకాలు ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోదొరుకుతాయి.

రచయిత: ఎస్. వెంకట్రావు

వెల: రూ. 5/-

***

రచయిత తనకు ఎంతో అభిమానమున్న నాయకుడు డి.శ్రీనివాస్ గురించి రాసిన పుస్తకమిది. ప్రతీ పేజీ మల్టీకలర్‌లో, కలర్‌ఫోటోలతో అందంగా తీర్చిదిద్దిన పుస్తకం.

విశ్వాసమే శ్వాసగా...

రచయిత: డా॥ ఎల్. శ్రీనాథ్

వెల: అమూల్యం

***

మార్క్సిజం పాఠాలు మొదటి భాగం

వెల: రూ. 8/-

మార్క్సిజం పాఠాలు రెండవ భాగం

వెల:రూ. 15/-

మార్క్సిజం పాఠాలు మూడవ భాగం

వెల:రూ. 8/-

ఇవి దొరుకు స్థలం విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలో



మార్క్సిజం పాఠాలు

రచయిత: తెలుగుసేత: ఆర్వియార్

వెల: రూ. 8/-



ఫిబ్రవరిలో ఆస్ట్రేలియా వెళ్ళాలను కుంటున్నారా? బహుళ సంస్కృతుల ఆస్ట్రేలియా పలు పండుగల్ని జరుపు కుంటుంది. అందులో సెయింట్ వేలంటైన్స్ డే ఒకటి. ఈ ఉత్సవాలు విభిన్న సంస్కృతుల నుంచి పుట్టుకొచ్చాయి. అవన్నీ ఆహ్లాదకర ఆస్ట్రేలియా వేసవి రోజులైన ఫిబ్రవరిలోనే యాదృచ్ఛి కంగా వచ్చాయి. "టూరిజం ఆస్ట్రేలియా" ఓ టూర్ ప్యాకేజీని అందిస్తోంది. అద్భుత ఆస్ట్రేలియాలో మీ సెలవులు ఉత్తమ జ్ఞాపకాలుగా నిలిచిపోయేలా ట్రావెల్ ఏజెన్సీలు రూపొందిస్తున్నాయి.

ఫిబ్రవరిలో ఆస్ట్రేలియా అమోఘం

క్వీన్స్‌లాండ్:

ఆస్ట్రేలియాలోని ప్రత్యేక ద్వీపాల్లో ఒకటైన బెడెర్రా బీచ్ చాలా అందమైనది. ఆహ్లాదకర మైంది. క్వీన్ లాండ్ తీరానికి కేవలం ఐదు కిలోమీటర్ల దూరంలో గల బెడెర్రా ద్వీపంలో వర్షపూరిత అడవులు, అద్భుత బీచ్‌లు ఉన్నాయి. అందమైన వెడ్జ్‌రాన్ ఖాతాన్ని వీక్షించేందుకు టింబర్ ఫ్లోర్, ఫ్లోర్-దు-సెవింగ్ గ్లాస్ విండోస్, ప్రైవేట్ పూల్‌తో కూడిన రెండు చక్కటి పెవిలియన్లు ఇక్కడ వున్నాయి. ఇక్కడున్న రిసార్ట్‌లో వనమూలికలతో కూడిన వివిధ థెరపీ సదుపాయాలతో పాటు కొత్త జిమ్, మసాజ్ కాంప్లెక్స్ వున్నాయి. ఈ విల్లా ట్రీట్‌మెంట్స్‌తో పాలు, మంచిగంధపు నూనె స్నానాల వంటివి కూడా లభ్యమవుతాయి.



హృదయాకారంలో తీర్చిదిద్దిన బెడెర్రా ద్వీపం

క్వీన్స్ లాండ్‌లోని విట్ సండేస్ స్వచ్ఛమైన నీటిలో తొమ్మిది మీటర్ల యాచ్‌పై స్కీపరింగ్, బీచ్‌ల్లో విహారం, అండర్ వాటర్ వండర్‌లాండ్‌లో స్నోర్కెల్ లాంటి ఆకర్షణీయమైనవి ఎన్నో ఉన్నాయి. 1500 రకాల చేపలున్న కోరల్‌లో డైవ్‌చేసి గ్రేట్ బాలియర్ రీఫ్ నీటిలో 25 మీటర్ల దిగువ నుంచి విరజిమ్మే కాంతిని వీక్షించడం మరో అద్భుత అనుభవం. అన్నిస్థాయిల్లో డైవర్స్ నీటి అంతర్భాగంలో సాహసోపేతమైన అద్భుత ప్రపంచాన్ని ఆస్వాదించవచ్చు.

న్యూసౌత్‌వేల్స్

సిడ్నీ ప్రేమికులకు ఒక కలలాంటిది. కాక్‌టైల్ నౌకలో షికారు, తదుపరి సిడ్నీ ఒపేరా హౌస్‌లో మర్చిపోలేని అనుభవాల సమాహారం. సిడ్నీ హార్బర్‌లో లగ్జరీ సెయిలింగ్ కాటామారన్ అధిరోహించి ట్విలైట్ కాక్‌టైల్ క్రోసీ ద్వారా మీకు నచ్చిన ఆట, పాటను వీక్షించడానికి మిమ్మల్ని సర్క్యులర్ క్యూమ్ వద్దనున్న సిడ్నీ ఒపేరా హౌస్‌కు చేరుస్తారు. విరామ సమయంలో సిడ్నీ హార్బర్‌ను చూస్తూ కొద్దిసేపు గడపటం వింత అనుభూతి.

విక్టోరియా

పట్టణానికి వెలుపల - మార్నింగ్‌టన్ పెనాన్సులా ఓ మంచి పిక్‌నిక్ ప్రదేశం. మెల్‌బోర్న్ నుంచి గంట ప్రయాణం గల మోన్‌టాల్టో పగలంతా విశ్రమించడానికి తగిన ప్రాంతం. నోరూరించే పదార్థాలతో భోజనం చేస్తూ ఆలీవ్ చెట్లను చూస్తూ గడిపేయవచ్చు. గ్రేట్ ఓషన్ రోడ్ తర్వాత అద్భుత విక్టోరియా నైరుతి తీరం వస్తుంది. టార్కే నుంచి పీటర్ బార్ వరకూ 300 కిలోమీటర్ల పొడవున విస్తరించిన ఈ తీర ప్రాంతమంతటా చక్కటి బీచ్‌లు, నదీ సంగమాలు పచ్చటి పర్వపు అడవులు విస్తరించి వున్నాయి. ప్రతీ మలుపుల్లోనూ అబ్బురపరిచే ప్రకృతి చిత్రాలను వీక్షించవచ్చు.

టాస్మేనియా

టాస్మేనియాన్ వైల్డర్‌నెస్‌లో హాబర్ట్‌నగరం నుంచి నాలుగు గంటలు ప్రయాణిస్తే ప్రపంచంలో సుదూర ప్రాంతంలో వున్న అనుభూతికి లోనవుతారు. చుట్టూ సరస్సుల్లో అద్దం లాంటి నీటిలో ప్రతిబింబించే ప్రపంచ చారిత్రాత్మక క్రెడిల్ పర్వతపు అంచున క్రెడిల్ మౌంటెన్ లాడ్జ్ నెలకొంది. డోల్ సరస్సు చుట్టూ రెండు గంటల పాటు నడవటం చక్కటి అనుభవమని టూరిస్టులు అంటారు. ✪



'కావ్యేషు నాటకం రమ్యం'. అన్ని సాహితీ ప్రక్రియల్లోకెల్లా నాటక ప్రక్రియ ఉదాత్తమైంది. అందుకే సాహితీ వేత్తలు నాటక ప్రక్రియను అపూర్వంగా భావిస్తారు. ఇటీవల విజయవాడ తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరిగిన 'నంది నాటకోత్సవం-2004'కు ప్రేక్షకాదరణ అపూర్వంగా ఉన్నప్పటికీ ఆ స్థాయిలో నాటక రచనలు రాలేదనే విమర్శలు వినిపించాయి.

మానవ సంబంధాలను ఎత్తిచూపిన

'నంది నాటకోత్సవం-2004'

విస్సా శేషగిరిరావు

నాటకోత్సవాల చివరి రోజు రాష్ట్ర వ్యాప్తంగా తరలి వచ్చిన కళాకారులతో రాష్ట్ర చలనచిత్ర, టీవీ, నాటక రంగాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె.వి. రమణాచారి సమావేశమయ్యారు. ఆ సమావేశంలో తెలుగు నాట అపూర్వమైన రచయితలున్నా, నాటక రచనల్లో కొరత ఉందని, అలాగే మంచి నాటక రచనలు రావడంలేదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ మాటలు పై విమర్శలకు బలాన్ని చేకూర్చాయి. ఈసారి పద్య, సాంఘిక నాటకం, నాటికల వంటి మూడు విభాగాలకు సంబంధించి మొత్తం 249 రచనలు నంది నాటకోత్సవాలకు దరఖాస్తులుగా అందాయి. అయితే అందులోని సాంఘిక నాటక, నాటిక విభాగంలో సుప్రసిద్ధ రచయితలు, దర్శకులు నేటి సమాజంలో తటస్థపడుతున్న అనేక అంశాలను ఇతివృత్తాలుగా తీసుకున్నా వాటిని నాటకీకరణ చేయడంలో లోపం కనిపించింది. మిశ్రో, నాయుడు గోపి వంటి కొద్ది మంది మినహా మిగిలిన నాటకకర్తలు పూర్తి స్థాయిలో కృషి చేయలేదనే భావన ప్రేక్షకుల్లో వ్యక్తమయింది. అయితే కొన్ని సమాజాలు ప్రదర్శించిన ప్రదర్శనలు నేడు తెలుగు నాటక రంగంలో వస్తోన్న మార్పులకు అద్దంపట్టాయి. ముఖ్యంగా సారా భూతంపై రూపొందించిన 'రాక్షసుడు' నాటిక కర్ణాటక రాష్ట్ర నాటక సంప్రదాయాన్ని తలపించింది. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో భక్తి పేరుతో ప్రజలను దోచుకుంటున్న దొంగ స్వాములు, అవెర్మార్ల తీరు తెన్నులను వివరించిన 'వలయం' నాటకం కూడా విభిన్న శైలిలో కొనసాగింది. ఈ నాటకంలో సుమారు 40 మంది కళాకారులు వివిధ జానపద కళారూపాలను ప్రదర్శించడం ప్రేక్షకులను ఆకట్టుకుంది. అదేవిధంగా పద్యనాటకాల్లో సైతం కొంత ఆధునికత కనిపించింది. ఇప్పటి వరకూ సురభి సంస్థలకు మాత్రమే పరిమితమయ్యాయనుకుంటున్న ట్రిక్‌లు, ఇతర సాంకేతిక పరిజ్ఞానం పద్య నాటక సమాజాలు వినియోగించు కునేందుకు ఆసక్తిని కనబరుస్తున్నాయి. ప్రపంచీకరణ నేపథ్యంలో దిగజారుతున్న ఉపాధి అవకాశాలు, తద్వారా ప్రభావితమవుతున్న యువత జీవితాలను వివరిస్తూ 'మాయ' నాటకాన్ని నాయుడు గోపీ ప్రదర్శించారు. ఈ నాటకంలో కొంత నాటకీయత లోపించిందనే వాదనలు వినిపించాయి. అయితే నాటకం మొత్తం మీద నేటి వ్యవస్థలోని పాలక విధానాలను చక్కగా వివరించే ప్రయత్నం చేసింది.

'శశిరేఖా పరిణయం' నాటక బృందం

పద్యనాటక విభాగంలో సురభి నాట్యకళామండలి హైదరాబాద్ వారి 'శశిరేఖా పరిణయం' బంగారు నందిని కైవసం చేసుకుంది. సురభి సంస్థ అనగానే తెలుగు వారికి తెలిసింది వారి రంగస్థల అద్భుతాలే. అయితే ఈ నాటకంలో ఆ స్థాయి కనపడలేదనే వ్యాఖ్యలు ప్రేక్షకుల నుంచి వినిపించాయి. మొన్నటి వరకూ వారి కుటుంబసభ్యులు మాత్రమే వీరి నాటకాల్లో కనిపించే వారు. కానీ ఇటీవల ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు గాను టీవీ కళాకారులకు కూడా వారి నాటకాల్లో అవకాశాలను కల్పిస్తున్నారు. గతంలో మనకు తెలిసిన 'మాయాబజారు' నాటకాన్నే 'శశిరేఖా పరిణయం'గా తీర్చిదిద్దారు. ఇందులో పాత్రధారుల ఆహార్యం ప్రేక్షకులను అలరించింది. ఈ నాటకంలో ఘటోత్కజుడు పాత్ర పోషించిన ఎస్.ఎ.జయరాం సహాయ నటుడిగా నిలిచాడు. లైటింగ్‌కు ఎస్.వి. పూర్ణచంద్రరావు బహుమతులు అందుకున్నారు. విజేత ఆర్ట్స్ రాజంపేట వారి "భూయో భూయో నమామ్యహమ్' ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైంది. ఈ నాటకంలో ప్రేక్షకులను పూర్తి స్థాయిలో ఆకట్టుకునే పట్టు లోపించిందనే వాదనలు వినిపించాయి. ఇందులో సుమారు 80 మంది కళాకారులతో చూడముచ్చటగా తీర్చిదిద్దిన ఈ నాటక దర్శకుడు దీక్షిత్ ఉత్తమ దర్శకుడుగా ఎంపికయ్యారు. రంగాలంకరణకు శిష్టా బహుమతులను అందుకున్నారు.



'ఆంబోతు' నాటిక బృందం

సాంఘిక నాటక విభాగంలో బహురూప నటసమాఖ్య విశాఖపట్నం వారి 'ఎలా బతకాలి? ప్రథమ ఉత్తమ ప్రదర్శనగా ఎంపికై బంగారు నందిని గెలుపొందింది. ప్రస్తుత వ్యవస్థలో నీతి, నిజాయితీలతో నడవాలనుకునే వ్యక్తికి అడుగడుగునా అడ్డంకులు ఎదురవుతుంటే, అతడు పడే మానసిక సంఘర్షణ ఏ విధంగా ఉంటుందో ఈ నాటకం వివరించింది. అలాగే జాతీయోద్యమానికి సారథులుగా ఉన్న పలువురు

'ఎలా బతకాలి?' నాటక బృందం

నాయకులతో నాటకాంతంలో చర్చ కొనసాగించిన తీరు బాగుంది. ఈ నాటకానికి సంబంధించి ఉత్తమ దర్శకుడుగా మిశ్రోకు, ఉత్తమ నటుడుగా ఐ.కె. త్రినాధరావు, సహాయ నటుడుగా పి.ఆర్.జె.పంతులు బహుమతులను అందుకున్నారు. మంజు ఆర్ట్ థియేటర్ వరంగల్ వారి 'ఓం' నాటకం ద్వితయ ఉత్తమ ప్రదర్శనగా ఎంపికై రజిత నందిని గెలుపొందింది. ఈ సమాజంలో ఎప్పటికీ శాశ్వతమైంది ధర్మం మాత్రమేననే ఇత్తివృత్తంతో సాగిన ఈ నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ద్వితీయ ఉత్తమ రచయితగా ఆకెళ్ల బహుమతులను అందుకున్నారు.

సాంఘిక నాటిక విభాగంలో గంగోత్రి పెద్దకాకాని వారి 'అంబోతు' నాటిక ప్రథమ ఉత్తమ ప్రదర్శనగా నిలిచి బంగారు నందిని కైవసం చేసుకుంది. దేశంలో పేటకో రౌడీ తయారవుతూ వ్యవస్థలోని సామాన్య ప్రజానీకాన్ని ఏవిధంగా ఇక్కట్ల పాలు చేస్తున్నారో ఈ నాటిక వివరించింది. ఈ నాటిక దర్శకుడు నాయుడు గోపీ ఉత్తమ దర్శకుడుగా, గంగోత్రి సాయి ప్రతినాయకుడిగా బహుమతులను అందుకున్నారు. భాగ్యశ్రీ ఫైన్ ఆర్ట్స్ విశాఖపట్నం వారి 'మానవత్వానికి మరో కోణం' ద్వితీయంగా నిలిచి రజిత నందిని గెలుపొందింది. మానవ సంబం ధాలన్నీ ఆర్థిక సంబంధాలుగా మారుతున్న ప్రస్తుత నేపథ్యంలో ప్రజల జీవితాలు ఏ విధంగా ప్రభావితమవుతున్నాయో ఈ నాటిక వివరించింది.

రాష్ట్రంలో తెలుగు నాటక రంగాభివృద్ధికి ఇప్పటి వరకూ ఉన్న ఏ ప్రభుత్వం కూడా కృషి చేసిన పాపాన పోలేదని నంది నాటకోత్సవాల బహుమతి ప్రధానోత్సవ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన కేంద్ర బొగ్గు గనుల శాఖ సహాయ మంత్రి దాసరి నారాయణరావు అన్నారు. రాష్ట్రంలో కళాకారులకు ఇళ్ళను యిప్పించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. అలాగే నంది నాటకోత్సవాలను రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో జరగాలనే ఆకాంక్షను వ్యక్తం చేశారు.

టి. కనకంకు ఎన్టీఆర్ స్మారక రంగస్థల పురస్కారం

ప్రభుత్వం ప్రతి ఏటా నంది నాటకోత్సవాల సందర్భంగా ప్రదానం చేసే నందమూరి తారకరామారావు స్మారక రంగస్థల పురస్కారాన్ని సుప్రసిద్ధ రంగస్థల, సినీ నటిమణి టి.కనకానికి దాసరి చేతులు మీదుగా ప్రదానం చేశారు. ఆమెకు బంగారు నంది, 50 వేల నగదుతో పాటుగా బంగారుపతకం, సన్మాన పత్రాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె గానం చేసిన పద్యాలాపనకు ప్రేక్షకులందరూ లేచి నిలబడి కరతాళ ధ్వనులందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న తనకు ఈ పురస్కారం పూర్వ ఆరోగ్యాన్ని అందించడమే కాకుండా మళ్లీ నటించాలనిపిస్తోందని ఉద్వేగంతో చెప్పారు. ○

అలరక్కసి

రమణీయ స్వప్నమై శోభించే చిత్రం
భీభత్స కావ్యమై హసిస్తుందని
అలల తీరుపై మృత్యువు అశనిపాతాలు వర్షిస్తుందని
ఎలా ఊహించడం?!
అందని లోతుల్లో ప్రకంపనలు
ప్రశాంత కడలిని మధిస్తే
తాడి ఎత్తు తరంగాలు
మృత్యుతురంగాలై కదం తొక్కుతాయని
ఎలా నమ్మడం!!
పుణ్య స్నానానికి సాగరతీరం చేరితే
అకాల మృత్యు పరిష్వంగం అడగని వరమా...?!
సునామీ హలంతో సాగిన సేద్యంలో
అసంఖ్యాక కళేబరాల సస్య ఫలితమా...
ఎంత కష్టం... ఎంత నష్టం
చెలియలి కట్టపై అలిగిన సంద్రం
జనావాసాలను పరామర్శిస్తే గుండె పగిలిన
జనఘోష
జలధి ఘోషతో జత కలిసింది
తాళిబంధాన్ని పేగుబంధాన్ని ఛేదించిన కరాళకెరటం
వృక్షశాఖలపై శవపతాకాలను ఆవిష్కరించింది
ప్రకృతి ఉన్మాదం ప్రకోపిస్తే



'కల' 'వల' చిద్రమైనవాడు
ఆత్మాభిమానాన్ని జలార్పణంచేసి
ఆదిభిక్షువు పాత్రను ఆదర్శంగా
స్వీకరిస్తున్నాడు
సామూహిక ఖననాలలో సమైక్యత వెల్లివిరుస్తూ
లక్షలాది జనం ఆక్రందన గీతం
సరిహద్దులు దాటి సహాయం అర్థిస్తున్నది
ప్రతి అశ్రుకణం ఒక విషాద జీవన విపంచిక
ప్రతి శిబిరం ఒక వ్యథిత హృదయ జ్వాలామాలిక
స్పందించిన హృదయాల సానుభూతి వర్షంలో
అవినీతి జంబుకాలు ఆనందస్నానాలు చేస్తున్నాయి
నిన్నటి అమీర్ నేటి ఫకీరైన పాఠం వింటూనే
వినోదంగా
నవ్వుతూ విధ్వంసాన్ని సొమ్ముచేసుకుంటున్నాయి
లక్షల ఆకాంక్షలను పాతరేసిన అలరక్కసి 'కల'
కలం
కన్నీటి సంద్రంలో ఇంకా కదులుతూనే వుంది
నూతన వత్సర వధువుకు ఆదిలోనే అమంగళమై
అగమ్య భవితను ఆందోళనగ అవలోకిస్తున్నది
ప్రకృతిపై మనిషి జయం ఎప్పుడెప్పుడంటున్నది.

-కె యస్వీ ప్రసాద్

న్యాయసలహాలు

జి.ఎల్.నరసింహారావు, హైకోర్టు న్యాయవాది

ఫ్యాక్టరీలో తిరిగి చేర్చుకోవాలంటే...

నేను శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం పైడి భీమవరంలో ఒక ఫ్యాక్టరీలో అక్టోబరు 2002 నుండి 2004 మే వరకు కార్మికుడుగా పనిచేశాను. 2004 మే నుండి ఆ ఫ్యాక్టరి నుండి తొలగించారు. అప్పుడు మాకు 1400/- జీతం ఇచ్చేవారు. (ప్రస్తుత ఫ్యాక్టరి మూసివేసి ఉన్నది) మరల ఇప్పుడు (సంక్రాంతి తరువాత) ఆ ఫ్యాక్టరి తెరుస్తారని అంటున్నారు. కాని మమ్మల్ని విధులలోకి తీసుకోకుండా క్రొత్త వారితో పని చేయించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని తెలిసింది. కాబట్టి మాకు న్యాయం జరగాలంటే ఎవరిని సంప్రదించాలి. ఎవరిని సంప్రదిస్తే మాకు న్యాయం జరుగుతుందో తెలియచేయవలయును. ఫ్యాక్టరి నుండి తొలగించినపుడు మేము రాజీనామా పత్రాన్ని సమర్పించలేదు.

ఒక కార్మికుడు

పతివాడపాలెం

ముందుగా కంపెనీ వారిని కలిసి మెమోరాండం ఇవ్వండి. ఆ తర్వాత మీకు దగ్గరలోని లేబర్ ఆఫీసర్‌ని కోరి జిల్లాలో (అసిస్టెంట్) లేబర్ కమిషనర్ నుంచి మెమోరాండం ఇస్తూ పూర్తి వివరాలు తెలియజేయండి. వారే కంపెనీ వారిని పిలిచి విషయం తేల్చగలరు. లేబర్ ఆఫీసర్ ద్వారానే మీకు న్యాయం జరుగగలదు.

మీ సోదరికే న్యాయం జరుగుతుంది

నా సోదరి వివాహం 1986వ సం॥లో జరిగింది. వివాహం జరిగిన తర్వాత 2 సం॥లకు ఇబ్బందులకు గురిచేసి, విడాకుల కొరకు కేసు వేశాడు. మేము మా బావగారి మీద కేసు వేస్తే, మనోవృత్తి కింద నెలకు 250 రూ. చెల్లించాలని తీర్పు చెప్పారు. కేవలం 2 సం॥లు మాత్రమే చెల్లించాడు. తర్వాత 1992 వ సం॥ నుండి నేటి వరకు మనోవృత్తి ఇవ్వడం ఆపేశాడు. మా బావగారు మరల వివాహం చేసుకున్నాడు. మా కుటుంబ సమస్యల కారణంగా మేము ఈ విషయంలో శ్రద్ధ చూపించలేక పోయాము. మా సోదరి ప్రస్తుతం మా వద్దనే ఉంటున్నది. మా బావగారు ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నాడు. 1992వ సం॥ నుండి నేటి వరకు చెల్లించకుండా ఆపేసిన మనోవృత్తి బకాయిలు చెల్లించవలసిందిగా కేసు వేయవచ్చునా? ప్రస్తుత జీవన వ్యయం ఆధారంగా ప్రతినెల మా సోదరికి ఎంత మేరకు మనోవృత్తిని మంజూరి చేయవచ్చునో, చట్ట ప్రకారం తెలియజేయగలరు. అతను రెండవసారి చేసుకున్న వివాహం ఎవరికి తెలియకుండా దొంగపెళ్లి చేసుకున్నాడు. మొదటి భార్య అనుమతి లేకుండా చేసుకున్నా పెళ్లి చెల్లుబాటు అవుతుందా? మా బావ గారి ఆస్తులపై చట్ట బద్ధమైన హక్కులు ఏ భార్యకు ఉంటాయి. నీ రెండవ భార్య వివాహాన్ని కోర్టు ద్వారా రద్దు చేయించడానికి వీలు ఉన్నదా. ప్రస్తుతం ఆమెకు ఇద్దరు పిల్లలు.

కె. నారాయణ

నల్గొండ.

మీ బావగారు వేసిన విడాకుల కేసు ఏమైనది తెలుపలేదు. విడాకులు కాకుండా చట్టప్రకారం రెండవ పెండ్లిచేసుకోవడం నేరమవుతుంది. మీరు బుజువు చేస్తే జైలుశిక్ష కూడా పడుతుంది. మనోవర్తి క్రింద రూ.250/- రెండు సంవత్సరములు ఇచ్చి తర్వాత ఇవ్వకుంటే మీరు అతడిపై పిటిషన్ వేసి బకాయిలతో సహా రాబట్ట వచ్చును. మనోవర్తి కూడ ఆ రోజుల్లో నిర్ణయించిన 250/- ప్రస్తుత ఖర్చుకుగాను పెంచమని అడగవచ్చు. అదే కోర్టులో మనోవర్తి పెంచామని పిటిషన్ వేయవచ్చును. గవర్నమెంటు ఉద్యోగి అయినందున రూ.3000/- పొందగలుగుతారు. మీ బావ ఆస్తులపై అతడికే హక్కు ఉంటుంది. అతడి భార్యగా మీ సహోదరికే (అతని రెండవభార్యకు ఉండదుగాని వారి సంతనానికి ఉంటుంది) అర్హత ఉంటుంది. రెండవ పెండ్లికి గుర్తుంపులేనపుడు రద్దు అనేది ఉండదుకదా.

సర్టిఫికేట్‌లో పేరు మార్పు ఎలాచేయాలి?

నేను బి.టెక్. మూడవ సంవత్సరం చదువుతున్నాను. ఫస్ట్ సెమ్ అయిపోయింది. కాలేజీలో నాకున్న పేరు లేక 10తరగతి సర్టిఫికెట్స్‌లో పేరు వేరేవిధంగా ఉంది. ఇపుడు చాలా ప్రాబ్లమ్స్ ఎదర్కొంటున్నాను. నా పేరు మార్చుకోవాలనుకుంటున్నాను. దయచేసి దానికి చేయవలసిన ప్రొసీజర్ వివరంగా తెలుపగలరు.

ఎస్.బి

హైదరాబాద్.

చంచల్‌గూడలో ఉన్న గవర్నమెంటు ప్రెస్‌నందు తగు ఫారంలు దొరుకుతాయి. అట్టి వాటిని పూర్తిచేసి మీ యం.ఆర్.ఓ గారితో (ఫాంలో ఉంటుంది) ఫాంలు నింపి రూ.50 చలాను కడితే గెజిట్ ప్రింటవుతుంది. ఆ రోజునుంచి మీ పేరు మీరనుకున్నట్టు గెజిట్‌లో మార్చినట్లు వాడుకోవచ్చు.



సేమ్యా ఐస్‌క్రీమ్

కావలసిన వస్తువులు:

సన్నని సేమ్యా	:	అర కప్పు
మీగడ పాలు	:	రెండు కప్పులు
పంచదార	:	అర కప్పు
యాలకుల పొడి	:	అర టీ స్పూన్
కోవా	:	అర కప్పు
మీగడ	:	అరకప్పు
కిస్‌మిస్	:	2 టీ స్పూన్లు

తయారుచేసే విధానం: పాలను మరగించి సేమ్యాను వేసి ఉడికించాలి. ఉడికాక చల్లార్చి పంచదార, కోవా, యాలకుల పొడి, మీగడ అన్నీ కలిపి మిక్సీలో వేసి రెండు సార్లు తిప్పి బాక్స్‌లో పెట్టి ఫ్రిజ్‌లో ఉంచాలి. కిస్‌మిస్‌ను నానబెట్టుకోవాలి. సర్వ్ చేసే ముందు కిస్‌మిస్ అలంకరించాలి. కోవా లేకున్నా ఫరవాలేదు. మిగతా పదార్థాలన్నీ ఇంట్లోనే ఉంటాయి. కాబట్టి సడన్‌గా చేయాలనుకుంటే ఇంట్లో ఉండే పదార్థాలతోనే రుచిగా ఉండే ఐస్‌క్రీమ్ చేసుకోవచ్చును. వెరైటీగా సేమ్యా ఐస్‌క్రీమ్ చేయడం మీరూ ట్రై చేయండి.

చిలగడ దుంపల చట్నీ

కావలసిన వస్తువులు:

చిలగడ దుంపలు	:	పావు కిలో
జీలకర్ర	:	ఒక స్పూన్
బెల్లం	:	కొంచెం
తాలింపుగింజలు	:	ఒక స్పూన్
కరివేపాకు	:	రెండు రెబ్బలు
ఎండుమిర్చి	:	50 గ్రాములు
చింతపండు	:	50 గ్రాములు
వెల్లుల్లి	:	ఒకటి
నూనె	:	రెండు గరిటెలు

తయారుచేసే విధానం: చిలగడ దుంపలు శుభ్రంగా కడిగి, తుడిచి తడి లేకుండా ఆరనివ్వాలి. ఎండుమిర్చి తొడిమలు తీసి నూనెలో వేయించాలి. వేడి నీళ్ళలో చింతపండు వేసి నాననివ్వాలి. ఎండుమిర్చి, చింతపండు, చిలగడ దుంపలు, వెల్లుల్లి, ఉప్పు, జీలకర్ర వేసి బాగా మెత్తగా మిక్సీలో గ్రైండ్ చేయాలి. ఇష్టమైతే బెల్లం వేసుకోవచ్చు. తాలింపు వేయాలి. ఆరిన తరువాత సీసాలో పెట్టుకుంటే నిల్వ ఉంటుంది.

కలం స్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీక్కూడా వీళ్లలాగా కలం స్నేహం చెయ్యాలని వుందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్ట్‌కార్డు తీసుకుని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్ ఫొటోను అతికించి పోస్టు చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలూ చెప్పండి. వాళ్లకు కూడా కలం స్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే. మరి మా అడ్రస్: **కలం స్నేహం**, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

పేరు : ఈదిగ ప్రణీత
వయసు : 6 సం॥
చదువు : 1వ తరగతి
హాబీలు: చదవడం, ఇంట్లో అల్లరి చేయడం, సినిమా పాటలు పాడడం.
చిరునామా:
ఈదిగ ప్రణీత,
డాటరాఫ్ ఇ.వి.భాస్కర్‌గౌడ్,
హౌస్ నెం:14/51, నియర్ వీరభద్ర లైన్, కొత్తపల్లి, కర్నూలు జిల్లా.

పేరు : ఎం.రాజు
వయసు : 15 సం॥
చదువు : 10వ తరగతి
స్కూలు: నలందా విద్యాలయం (ఎస్.ఆర్.డి)
హాబీలు: పుస్తక పఠనం, క్రికెట్ ఆడడం, కలం స్నేహం చేయడం, సంగీతం వినడం, టీవీలో న్యూస్ చూడడం.
చిరునామా:
ఎం.రాజు, సన్నాఫ్ ఎం.లింగమయ్య, హౌస్ నెం: 6-6-122/6/ఎ, శివాజీనగర్, సంగారెడ్డి, మెదక్ జిల్లా. **పిన్:** 502 001.

పేరు : ఎల్.చరణ్‌రాజ్
వయసు : 6 సం॥
చదువు : 1వ తరగతి
హాబీలు: అల్లరి చేయడం, డాన్స్ చేయడం, జోక్స్ వేయడం, చదవడం.
చిరునామా:
ఎల్.చరణ్‌రాజ్,
సన్నాఫ్ ఎల్.దేశ్యానాయక్,
నర్సాయపల్లి, అచ్చంపేట (మం),
మహబూబ్‌నగర్ జిల్లా.

పేరు : గుండబోయిన మౌనిక
వయసు : 7 సం॥
చదువు : 1వ తరగతి
హాబీలు: ఆటలు ఆడడం, ప్రజాశక్తి ఆదివారం అనుబంధం చదవడం.
చిరునామా:
జి.మౌనిక,
హౌస్ నెం: 2-65,
అంకిరెడ్డి గూడెం,
చౌటుప్పల్ (మం), నల్గొండ జిల్లా.

పేరు : పి.సాయి ప్రవళిక
వయసు: 6 సం॥
చదువు : యు.కె.జి
హాబీలు: డ్రాయింగ్ వేయడం, టీవీ చూడడం.
చిరునామా:
పి.సాయి ప్రవళిక,
డాటరాఫ్ పి.శ్రీనివాసులు (ఎల్.ఎం),
ఎల్.ఐ.జి క్వార్టర్స్, హౌసింగ్ బోర్డ్ కాలనీ, గద్వాల, మహబూబ్‌నగర్ జిల్లా.

పేరు : బి.రమేష్
వయసు : 12 సం॥
చదువు: 8వ తరగతి
హాబీలు: క్రికెట్, చెస్ ఆడడం, పుస్తక పఠనం, ప్రజాశక్తి చదవడం.
లక్ష్యం: డాక్టర్ కావడం.
చిరునామా:
బి.రమేష్,
సన్నాఫ్ బొడియ, భీక్య తండ,
మోతె (మం), నల్గొండ జిల్లా.

పేరు : ఈదిగ ప్రదీప్ గౌడ్
వయసు: 9 సం॥
చదువు: 3వ తరగతి
హాబీలు: చదవడం, క్రికెట్ ఆడడం, టీవీ చూడడం.
చిరునామా:
ఈదిగ ప్రదీప్‌గౌడ్,
సన్నాఫ్ ఇ.విజయభాస్కర్ గౌడ్,
హౌస్ నెం:14/51,
కొత్తపల్లి, కర్నూలు జిల్లా.

పేరు : సొగాల ప్రవళిక
వయసు : 12 సం॥
చదువు: 6వ తరగతి
హాబీలు: డాన్స్ చేయడం, ప్రజాశక్తి సండే బుక్ చదవడం, టీవీ చూడడం.
చిరునామా:
సొగాల ప్రవళిక,
డాటరాఫ్ ఎస్.లక్ష్మణ్,
హౌస్ నెం:1-90, మెయిన్ రోడ్,
కాశీపేట (గ్రా & మం),
ఆదిలాబాద్ జిల్లా. **పిన్:** 504 232.